

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | ఆదివారం 16-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 239 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# కరోనా, టీకా డ్రైవ్‌పై ప్రధాని ఉన్నత స్థాయి సమీక్ష




న్యూఢిల్లీ, మే 15: దేశంలో కరోనా పరిస్థితి, టీకా డ్రైవ్ ప్రధాని నరేంద్ర మోదీ సమీక్ష జరిపారు. దేశంలో కరోనా ఉధృతి కొనసాగుతున్న వేళ తాజా పరిస్థితులు, వ్యాక్సిన్ పంపిణీపై ప్రధానమంత్రి ఉన్నతస్థాయి అధికారులతో వర్చువల్ విధానంలో చర్చలు జరిపారు.

సమావేశానికి పీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఆరోగ్యమంత్రిత్వశాఖ సెక్రెటరీ తదితరులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. గత 24 గంటల్లో కొత్తగా 3,26,098 కేసులు నమోదయ్యాయి. మరో 3,890 మంది మృతిచెందారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 2,43,72,907కు చేరింది. ఇందులో 2,04,32,898 మంది బాధితులు కోలుకోగా, 36,73,802 కేసులు యాక్టివ్ కేసులున్నాయని, వైరస్ బారినపడి మొత్తం 2,66,207 ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్యశాఖ తెలిపింది.

మరో వైపు అలాగే తౌక్టే తుఫాను నేపథ్యంలో చేపట్టిన చర్యలపై సైతం సాయంత్రం 5 గంటలకు ప్రధాని సమీక్ష నిర్వహించనున్నారు. తుఫాను హెచ్చరికలు, ముందస్తు చర్యలపై అధికారులతో మాట్లాడనున్నారు. తౌక్టే తుఫాను అమినీ దీవికి ఈశాన్య దిశగా 160 కిలోమీటర్ల దూరంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారుతుందని, ఉత్తర వాయువ్య దిశగా ప్రయాణించి మరింత బలపడుతుందని పేర్కొంది. తదుపరి 12 గంటల్లో మరింత బలపడి అతితీవ్ర తుఫానుగా మారుతుందని, ఈ నెల 18న గుజరాత్ వద్ద రాత్రి 8.30గంటల మధ్య పోరుబందర్ ? నలియా మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఈ సమయంలో 150-175 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అవకాశం ఉందని వివరించింది.

## బిట్‌శాట్ 2021 పరీక్ష వాయిదా.. దరఖాస్తు గడువు పొడిగింపు

ఢిల్లీమే 15: బిట్‌శాట్ 2021 ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. కరోనా మహమ్మారి నేపథ్యంలో బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) పిలానీ ఈ నిర్ణయం వెలువరించింది. పరీక్ష జూన్ 24 నుండి 29వ తేదీ మధ్యలో జరగాల్సి ఉండే. కాగా తాజా నిర్ణయంతో జూలై, ఆగస్టులో జరగనుంది. పరీక్షల తేదీలను జూన్‌లో వెబ్‌సైట్ ద్వారా ప్రకటించనున్నట్లు తెలిపింది.

ఈ క్రమంలో దరఖాస్తు గడువు తేదీని పొడిగించింది. విద్యార్థులు తమ దరఖాస్తులను జూన్ 30 సాయంత్రం 5 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ ఎతిబిబజీటఎతిబబతినీని.ఇనీఎ ద్వారా సమర్పించవచ్చు. దరఖాస్తు రుసుం పురుష అభ్యర్థులకు రూ.3,400, మహిళా అభ్యర్థులకు రూ.2,900గా ఉంది. అదే దుబాయ్‌లో పరీక్షకు హాజరు కావాలనుకునే విద్యార్థులకు దరఖాస్తు రుసుము రూ. 7 వేలు. బిట్స్, పిలాని, గోవా, హైదరాబాద్‌లోని క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం బిట్‌షాట్ జరుగుతుంది.

## టీకాలు తీసుకున్నా.. మాస్కులు మరువొద్దు : డాక్టర్ రణదీప్ గులేరియా

న్యూఢిల్లీ, మే 15: పూర్తిగా టీకాలు తీసుకున్నా వారు కూడా మాస్కులు ధరించడం, నిర్ణీత భౌతిక దూరం కొనసాగించాలని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా సూచించారు. కొవిడ్-19 నిరంతరం తన మ్యుటేషన్‌ను మార్చుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన టీకాలు ఎంతవరకు రక్షిస్తాయో నిపుణులకు ఇంకా తెలియలేదని, అందుకే జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉన్నదని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. డాటా వచ్చేంతవరకైనా కొవిడ్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

పూర్తిగా టీకాలు తీసుకున్నవారు మాస్కులు లేకుండా బయటకు వెళ్ళవచ్చని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో డాక్టర్ గులేరియా ఈ వ్యాఖ్యలు చేశారు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా మనం వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

దేశంలోని ప్రజలందరికీ టీకాలు వేయడం ఒకటి లేదా రెండు నెలల్లో సాధ్యం కాదని తేల్చిచెప్పారు. అయితే, రెండు నెలల్లో పెద్ద మొత్తంలో వ్యాక్సిన్ లభించనున్నదని, అప్పుడు చిన్నారులకు కూడా వ్యాక్సిన్లు వేసే స్థాయికి చేరుకుంటామన్నారు. కరోనా వైరస్ ఇన్‌ఫెక్షన్‌కు గురైతే వృద్ధులు, తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉన్న రోగులు చనిపోయే అవకాశం ఉన్నదని డాక్టర్ రణదీప్ గులేరియా చెప్పారు. ఇటువంటి పరిస్థితిలో అలాంటి వారికి టీకాలు వేయడానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని స్పష్టం చేశారు.

## కలిసి కట్టుగా కరోనా కట్టడి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ మే 15: : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ కలిసికట్టుగా పనిచేసి కరోనాను కట్టడి చేసేందుకు కృషి చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, షాద్ నగర్ అధికారులతో కరోనాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

మరో వారం, పది రోజులు కరోనా కట్టడికి అందరం ఇంకా ఎక్కువ కష్టపడి పని చేద్దామని మంత్రి పేర్కొన్నారు.

లాక్ డౌన్ ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. లాక్ డౌన్ కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వారికి అవసరమైన సరుకులు, కూరగాయలు అందుబాటులో ఉండేలా చూడాలి. ధరలు నియంత్రణలో ఉండాలి. ప్రైవేట్ దవాఖానలో కూడా ఆక్సిజన్, రేమిడివిసిఆర్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉండాలన్నారు.

ఫీవర్ సర్వే, కరోనా రోగుల కు సంబంధించి గ్రామాల వారీగా, మండలాల వారీగా పూర్తి వివరాలు సేకరించాలని మంత్రి తెలిపారు. అన్ని జిల్లాలలో కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఒకవేళ డాక్టర్ వెళ్లలేని పక్షంలో ఫోన్ ద్వారా వారి యోగక్షేమాలను కనుక్కుని మనోధైర్యం నింపాలని మంత్రి సూచించారు.

రెండు రోజుల్లో మహబూబ్ నగర్ జిల్లాలో 500 బెడ్ లతో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పూర్తిస్థాయిలో కరోనా వార్డు సిద్ధం చేస్తామన్నారు. మంగళవారం నాటికి షాద్ నగర్ లో 30 పడకలు ఆక్సిజన్ తో సిద్ధమవుతాయి. ఆయా జిల్లాలోని డాక్టర్లు కరోనా పేషెంట్లను ముందు ఐసోలేషన్ లో, తర్వాత ఆస్పత్రిలో ఉంచాలన్నారు.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో కరోనా రోగుల సహాయకులకు భోజనం ఏర్పాటు చేయాలి. గత సంవత్సరం లాగే జిల్లా కేంద్రంలో బిచ్చగాళ్లకు కేర్ సెంటర్, భోజనంఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అవసరం అయితే నిధులు సమకూరుస్తానని హామీనిచ్చారు.

కార్యక్రమంలో..ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఎస్పీలు ఆర్ వెంకటేశ్వర్లు, చేతన, మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, ఇతర అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దేశంలోని ప్రజలందరికీ టీకాలు వేయడం ఒకటి లేదా రెండు నెలల్లో సాధ్యం కాదని తేల్చిచెప్పారు. అయితే, రెండు నెలల్లో పెద్ద మొత్తంలో వ్యాక్సిన్ లభించనున్నదని, అప్పుడు చిన్నారులకు కూడా వ్యాక్సిన్లు వేసే స్థాయికి చేరుకుంటామన్నారు. కరోనా వైరస్ ఇన్‌ఫెక్షన్‌కు గురైతే వృద్ధులు, తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉన్న రోగులు చనిపోయే అవకాశం ఉన్నదని డాక్టర్ రణదీప్ గులేరియా చెప్పారు. ఇటువంటి పరిస్థితిలో అలాంటి వారికి టీకాలు వేయడానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని స్పష్టం చేశారు.

## దేశంలో తగ్గిన వైరస్ పాజిటివిటీ రేటు

న్యూఢిల్లీ, మే 15: వైరస్ నియంత్రణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. ఇండియాలో పాజిటివిటీ రేటు తగ్గిందన్నారు. గత వారం దేశంలో పాజిటివిటీ రేటు 21.9 శాతంగా ఉందని, అయితే ఇప్పుడు ఆ రేటు 19.8 శాతానికి తగ్గినట్లు తెలిపారు. ఢిల్లీ, చత్తీస్‌ఘడ్, డమన్ అండ్ డయూ, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధిక స్థాయిలో వైరస్ పాజిటివిటీ రేటు తగ్గిందని ఆయన తెలిపారు.

దేశంలో కరోనా వైరస్ కేసులు పెరుగుతున్నా.. హాస్పిటళ్ల వద్ద వైరస్ సంక్రమణ నివారణ చర్యలు కీలకమని, అయితే సెకండరీ ఇన్‌ఫెక్షన్లు వల్లే ప్రమాదం ఏర్పడుతోందని, ఫంగస్ లేదా బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ వల్ల ఎక్కువ శాతం మరణాలు నమోదు అవుతున్నట్లు ఎయిమ్స్ డైరక్టర్ రణ్‌దీప్ గులేరియా తెలిపారు.

## ధాన్యం కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



వనపర్తి మే 15: దేశంలో ధాన్యం కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై మంత్రుల నివాస సముదాయం నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ లో మంత్రి మాట్లాడారు. కరోనా నేపథ్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు కొనుగోళ్ల విషయంలో చేతులెత్తేశాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు మేలు చేయాలని తీసుకున్న నిర్ణయం అని మంత్రి చెప్పారు.

దేశ వ్యాప్తంగా వస్తున్న దిగుబడిలో సగానికి పైగా ధాన్యం తెలంగాణ నుంచి వస్తుందని, మిల్లర్లు అధికారులు చెప్పింది వినాలని మిల్లర్లు చెప్పింది అధికారులు వినొద్దన్నారు. రైతు కల్లంకాడికి వస్తే ఇంత ధాన్యం ప్రేమతో పెడతాడు. కానీ తూకం వేసిన తర్వాత అన్యాయంగా కట్ చేస్తే ఏ మాత్రం ఒప్పుకోమని తూకం వేసిన తరువాత మళ్లీ తరుగు తీస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎవరైనా మిల్లర్లు తరుగు తీస్తే మిల్లుల లైసెన్సులు నిర్మోహమాటంగా రద్దు చేయండి. అందుబాటులో ఉన్న అన్ని రైతువేదికలు, ఇతర గోదాంలు అన్నీ వినియోగించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో జాప్యం జరగకుండా చూడాలన్నారు.

కరోనా విపత్తులోనూ ప్రభుత్వం కొంటున్న విషయం దృష్టిలో పెట్టుకోవాలి, క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంట అమ్ముకునే విషయంలో ఇబ్బందిపెట్టటం మంచి పద్ధతి కాదన్నారు.

మిల్లర్ల విషయంలో ఎట్టి పరిస్థితులలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించొద్దన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, పౌరసరఫరాలు శాఖ డీఎవో, డీసీవో, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఎసీఎస్ అధ్యక్షులు, రైతుసమన్వయ సమితి అధ్యక్షులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్ట్ ఏజెన్సీలు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా లక్షణాలున్న రోగుల కోసం ప్రత్యేక వార్డు

లక్నో మే 15: కరోనా నుంచి కోలుకున్న తర్వాత కూడా రోగుల్లో కొన్ని లక్షణాలుంటున్నాయి. ఇవి కొన్ని నెలలపాటు ఉండే అవకాశమున్నదని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సివిల్ హాస్పిటల్‌లో కోవిడ్ అనంతర లక్షణాలున్న రోగుల కోసం ప్రత్యేక వార్డ్ ఏర్పాటు చేశారు. కరోనా నుంచి కోలుకున్న తర్వాత కూడా రోగుల్లో బలహీనత, శ్వాస సంబంధ సమస్యలు ఉంటున్నాయని డాక్టర్ బీఆర్ జైస్వాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి పరీక్షలు నిర్వహించడంతో వైద్యుల పర్యవేక్షణలో ఉంచాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో కరోనా నుంచి కోలుకున్న తర్వాత కూడా లక్షణాలున్నవారి కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో తొలిసారి ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కరోనా నుంచి కోలుకున్న తర్వాత ఇండ్లకు వెళ్లిన వారికి అనంతర వైద్య సేవల కోసం ఔట్ పేషంట్ విభాగాన్ని కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

## భారత్‌లో పరిస్థితి ఆందోళనకరం : డబ్ల్యూహెచ్‌వో

హైదరాబాద్ , మే 15: భారత్‌లో ఉన్న కోవిడ్ పరిస్థితిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌లో అనేక రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నాయని, చాలా మంది హాస్పిటల్ పాలవుతున్నారని, మరణాలు కూడా అధికంగానే చోటుచేసుకుంటున్నట్లు డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ అథనమ్ గెబ్రియేసిస్ తెలిపారు. ప్రపంచ దేశాలకు టెడ్రోస్ వార్నింగ్ కూడా ఇచ్చారు. మహమ్మారి సోకిన తొలి ఏడాది కన్నా.. రెండవ ఏడాది మరింత ప్రమాదకరంగా ఉంటుందని, మరణాలు ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యే అవకాశాలు ఉన్నట్లు ఆయన హెచ్చరించారు.

భారత్‌లో వ్యాపిస్తున్న కరోనా వైరస్ ఉధృతిని అడ్డుకునేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకరిస్తోందని ఆయన అన్నారు. ఇప్పటికే ఆ దేశానికి వేల సంఖ్యలో ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్లను సరఫరా చేసినట్లు టెడ్రోస్ తెలిపారు. మొబైల్ హాస్పిటళ్లకు టెంట్లు, మాస్కులు, ఇతర మెడికల్ సామాగ్రిని పంపినట్లు చెప్పారు. జెనీవాలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాలను వెల్లడించారు. ఇండియాకు సపోర్ట్ ఇస్తున్న అన్ని దేశాలకు ఆయన థ్యాంక్స్ తెలిపారు.

## ఇవాళ, రేపు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు

హైదరాబాద్ , మే 15: విదర్భ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం బలహీనపడింది. గోవాకు దక్షిణ నైరుతి దిశగా 330 కిలోమీటర్ల దూరంలో తౌక్తే తుపాను కేంద్రీకృతమైంది.

రాగల 6 గంటల్లో తౌక్తే తుపాను తీవ్ర తుపానుగా మారనుంది. తదుపరి 12 గంటల్లో అతి తీవ్ర తుపానుగా మారనుంది. ఉత్తర వాయవ్య దిశగా ప్రయాణించి తౌక్తే తుపాను మరింత బలపడనుంది. ఈ నెల 18న మధ్యాహ్నం 2:30 నుంచి రాత్రి 8:30 గంటల మధ్య గుజరాత్ వద్ద తౌక్తే తుపాను తీరం దాటనుంది.

తౌక్తే తుపాను నేపథ్యంలో ఇవాళ, రేపు రాష్ర్టంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి ఒకట్రెండు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఇవాళ దక్షిణ తెలంగాణ జిల్లాలపై, రేపు పశ్చిమ తెలంగాణ జిల్లాలపై వర్షం ప్రభావం ఉండనుంది.

## తెరుచుకున్న గంగోత్రి ఆలయం.. భక్తుల దర్శనానికి నో ఛాన్స్



ఉత్తరకాశీ మే 15: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హిమాలయ శ్రేణుల్లో ప్రముఖ ఆలయమైన గంగోత్రి ఆలయం తెరుచుకుంది. కొవిడ్ నేపథ్యంలో తలుపులు తెరిచే వేడుకను శనివారం ఉదయం నిరాడంబరంగా నిర్వహించారు.

ఆలయ పూజారులతోపాటు కొద్ది మంది అధికారులు వేడకకు హాజయ్యారు. అక్షయ తృతీయ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణకు ఈ ఉదయం 7 గంటల 31 నిమిషాలకు తలుపులను తెరిచామని గంగోత్రి ఆలయ పూజారి రవీంద్ర సెమ్వాల్ తెలిపారు.

కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేసిన కొద్ది మంది అధికారులు, ఆలయ కమిటీ సభ్యులను మాత్రమే తలుపులు తెరిచే వేడుకకు అనుమతించినట్లు వెల్లడించారు. ఆలయం తెరిచిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ తరఫున తొలిపూజ నిర్వహించారు.

ఉత్తరాఖండ్‌లో కొవిడ్ విజృంభణ నేపథ్యంలో ఈ ఏడాది ఛార్‌దామ్ యాత్ర రద్దయ్యింది.

దీంతో సాధారణ పూజల నిర్వహణకు షెడ్యూల్ ప్రకారం హిమాలయ శ్రేణుల్లోని నాలుగు ఆలయాల తలుపులను తెరిచారు. యువనోత్రి ఆలయ తలుపులు గత నెల 14న, కేదర్‌నాథ్ ఆలయం 17న, బద్రీనాథ్ ఆలయాన్ని 18న తెరిచిన విషయం తెలిసిందే. ఆలయాన్ని తెరిచినా భక్తులనెవరినీ దర్శనానికి అనుమతించబోమని ఆలయ వర్గాలు తెలిపాయి.

## చైనాలో తుఫాను ఏడుగురు మృతి

బీజింగ్ మే 15: చైనాలో తుఫాన్ బెంబేలెత్తిస్తున్నది. శక్తివంతమైన తుఫాన్ రావడంతో ఏడుగురు మృత్యువాతపడ్డారు. దాదాపు 238 మంది తీవ్రంగా గాయపడ్డారు. వుహాన్, సుజౌ నగరాల్లో సంభవించిన శక్తివంతమైన తుఫానులు రెండు నగరాలను అతలాకుతం చేశాయి. భారీ నష్టాలను కలిగించాయి. ఈ రెండు నగరాల్లోని చాలా ఇళ్ళు కూలిపోయాయి. నిర్మాణంలో ఉన్న స్థలాలు ధ్వంసమయ్యాయి. తుఫాను రావడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎందుకంటే సాధారణంగా ఈ ప్రాంతంలో తుఫానులు ఇంతవరకు రాకపోవడమే.

జిన్హువా వార్తా సంస్థ ప్రకారం, వుహాన్ నగరంలో ఆరుగురు మరణించారు. దాదాపు 218 మంది గాయపడ్డారని వుహాన్ ప్రభుత్వం తెలిపింది. తుఫాను గంటకు 86 కిలోమీటర్ల వేగంతో వీయడంతో నిర్మాణంలో ఉన్న చాలా ఇండ్ల తాత్కాలిక పైకప్పులు, చెట్లు ఎగిరిపోయాయి. అదేవిధంగా, సుజౌ నగరంలో కూడా భారీగానే నష్టం సంభవించింది. జియాంగ్సు ప్రావిన్స్‌కు తూర్పున 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న షెంగ్జె పట్టణంలో కూడా తుఫాన్ సంభవించి, ఒక వ్యక్తి మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు. తుఫాను కారణంగా షెంగ్జెలోని భవనాలు ధ్వంసమయ్యాయి, విద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి.

## ఎవరెస్ట్ శిఖరం అధిరోహణపై నిషేధం

ఇలాఉండగా, ఎవరెస్ట్ శిఖరం అధిరోహణపై చైనా నిషేధం విధించింది. విదేశీ అధిరోహకుల ద్వారా కరోనా ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నేపాల్ నుంచి ఎవరెస్ట్ చేరుకుంటున్న అధిరోహకుల వల్ల కూడా ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే అవకాశం ఉందని చైనా అభిప్రాయపడింది. నేపాల్‌లో కరోనా కేసులు ఉధృతంగా ఉన్నాయి. అందుకే నేపాల్ సరిహద్దులో చైనా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నది.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ రచయిత నట్వరు సింహుడు
వచియించిన మాట కొరకు బ్రతుకు ఘనునిగా
నచలుండగు పాలకునిగ
రుచిరమ్ముగ జాతిచరితలో వెలుగొందున్ !!



-రాధశ్రీ
సెల్: 9494481210

( మే 16 రచయిత, నేత నట్వర్‌సింగ్ పుట్టిన రోజు...)

## గ్రనేడ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం

గౌహతి మే 15: : గ్రనేడ్ పేలుడులో చనిపోయిన మృతుల కుటుంబాలకు అసోం సీఎం హిమంత బిస్వా శర్మ రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. దిగ్బాయ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తింగ్రాయ్ మార్కెట్ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఈ పేలుడులో ఇద్దరు మరణించగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు దిబ్రుగర్ ఏఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా అసోం సీఎం బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించారు. పేలుడుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాంతికి విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. పేలుడుకి బారువా నేతృత్వంలోని ఉల్ఫా(ఐ) కారణమై ఉండొచ్చని దర్యాప్తు అధికారులు పేర్కొనగా ఈ ఆరోఫణలను తిరుగుబాటుదారుల బృందం ఖండించింది.

## వైఎస్ ప్రతాప్ రెడ్డి కార్యాలయంలో పోలీసుల తనిఖీలు

అమరావతి, మే 15: : కడప జిల్లా మామిళ్లపల్లి గనిలో పేలుళ్ల ఘటన దర్యాప్తులో భాగంగా పోలీసులు శనివారం పులివెందులోని వైఎస్ ప్రతాప్ రెడ్డి కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో పనిచేసే పలువురు సిబ్బందిని విచారించి పేలుడు పదార్థాల నిల్వ, విక్రయంపై వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. మామిళ్లపల్లి క్వారీలో ఈ నెల 8న జిలెటిన్ స్టిక్స్ పేలి 10 మంది మృతి చెందారు. ఘటనలో ఇప్పటికే గని లీజుదారు, జిలెటిన్ స్టిక్స్ సరఫరాదారును అరెస్టు చేశారు. ఇదే కేసులో ఈ నెల 11న ప్రతాప్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. ఈయన స్వయానా ఏపీ సీఎం జగన్‌కు బంధువు. కడప జిల్లాలోని పులివెందుల, సింహాద్రి పురం తదితర ప్రాంతాల్లో ప్రతాప్ రెడ్డి గనులను నిర్వహిస్తున్నారు. మామిళ్లపల్లి గనిలో పేలుళ్లు జరిపేందుకు ఈయన నుంచే గని లీజుదారుడు జిలెటిన్ స్టిక్స్ తీసుకెళ్లినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు.

# లాక్‌డౌన్‌లోనూ లోడ్లకు లోడ్లు



నల్లగొండ మే 15: మూడు రోజులుగా అమలవుతున్న లాక్‌డౌన్ సమయంలోనూ ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. గతేడాది యాసంగిలో నల్లగొండ జిల్లాలో టార్గెట్‌ను మించి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేసిన అధికారులు. మొత్తంగా 6,46,680 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ యాసంగిలోనూ అదే రీతిలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. యాసంగిలో సాధారణంగా ఉండే ఐకేపీ కేంద్రాలకు తోడు ఈ సారి పీఏసీఎస్, మార్కెట్ యార్డుల ద్వారా రైతుల అవసరాలకు తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై మంత్రి జగదీశ్‌రెడ్డి నిరంతరం సమీక్షలు చేస్తూ ఎప్పటికప్పుడు అధికారులు, రైతులను అప్రమత్తం చేశారు. ఒక్కో సమస్యను అధిగమిస్తూ.. రైతులతో సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్నారు. మధ్యమధ్యలో వచ్చిన అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ కొనుగోళ్లల్లో ఆటంకాలను అధిగమిస్తున్నారు. ధాన్యంలో తాలు తదితర సమస్యలు వస్తే రైతు ప్రతినిధులతో పాటు రైస్‌మిల్లర్ల ప్రతినిధులతో పలుమార్లు సమావేశమై చర్యలు చేపట్టారు. ఎస్పీ రంగనాథ్ నేతృత్వంలో పోలీసు శాఖ సహకారంతో సాంకేతికంగా వస్తున్న ఇబ్బందులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ యాసంగిలో శుక్రవారం నాటికి 4, 92, 051 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఏడున్నర లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటివరకు మొత్తం 65,688 మంది రైతుల నుంచి 4.92లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఐకేపీ కేంద్రాల ద్వారా 29,766 మంది రైతుల నుంచి 2,34,248 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 32,317 మంది రైతుల నుంచి 2,28,603 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇక 13 వ్యవసాయ మార్కెట్ల ద్వారా 3,605 మంది రైతుల నుంచి 29,200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి.

ఎప్పటికప్పుడు లారీల్లో తరలింపు

కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల్లో మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు 4.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేరవేశారు. వీటిల్లో ఐకేపీ కేంద్రాల ద్వారా రూ.442 కోట్లు, పీఏసీఎస్‌ల ద్వారా 431.60 కోట్లు, మార్కెట్ యార్డుల ద్వారా 55.13 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు చేశారు. ట్యాబ్ ఎంట్రీ అయిన వాటి ల్లో 90 శాతం పైగా చెల్లింపులు పూర్తి చేశారు. ఇప్పటివరకు ఐకేపీ కేంద్రాల ద్వారా రూ. 160 కోట్లు, పీఏసీఎస్‌ల ద్వారా రూ.189 కోట్లు, మార్కెట్ల ద్వారా రూ.17 కోట్ల నగదు కలిపి మొత్తం 366 కోట్ల నగదును రైతులకు చెల్లింపులు చేస్తూ వారి ఖాతాల్లో జమ చేశారు. మరో 470 కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీకి సిద్ధంగా ఉన్నాయి. ధాన్యం కొనుగోళ్ల చెల్లింపులను కూడా ఎక్కడా ఆపకుండా ఎప్పటికప్పుడు క్లి యర్ చేస్తూ వస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలోనూ ధాన్యం కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మొత్తం 339 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. 209 ఐకేపీ, 130 పీఏసీఎస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటివరకు మొత్తం 3,74,697 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో ఐకేపీల ద్వారా 2,05,968 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌ల ద్వారా 1,68,728 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. శుక్రవారం నాటికి జిల్లాలో మొత్తం 47,254మంది రైతుల నుంచి రూ.707.36 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రకటించారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 94 శాతం అంటే 3.53లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశించిన రైస్‌మిల్లులకు తరలించారు. ఇక కొనుగోలు చేసిన ధాన్యంలో 27,950 మంది రైతులకు రూ.431 కోట్లు రైతులకు చెల్లింపులు చేస్తూ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఐకేపీల ద్వారా 192 కోట్లు, పీఏసీఎస్‌ల ద్వారా 239 కోట్ల చెల్లింపులను పూర్తి చేశారు. ఇప్పటివరకు 36,369 మంది రైతులకు సంబంధించి 2.84మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశారు. జిల్లాలో ఇంకా మార్కెట్లకు వచ్చి ఉన్న ధాన్యాన్ని అంతా కొనుగోలు చేసేందుకు అధికారులు తగిన ప్రణాళికతో ఉన్నారు.

# 80శాతం ధాన్యం కొనుగోలు



హన్మకొండ, మే 15: అర్బన్ జిల్లాలో ప్రణాళికాబద్ధంగా ఇప్పటి వరకు 80శాతం మేర ధాన్యాన్ని కొనుగోలు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, సివిల్ సప్లయ్, డీఆర్డీవో అధికారులతో ధాన్యం కొనుగోలుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 105 కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 52,986 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఎంపిక చేసిన 20 రైస్ మిల్లులకు కస్టం మిల్లింగ్ చేసేందుకు ప్రత్యేక వాహనాల ద్వారా ధాన్యాన్ని పంపిస్తున్నట్లు తెలిపారు. కొవిడ్ కారణంగా హమాలీల కొరతతో కొంత ఆలస్యమైనా నెలాఖరులోగా పూర్తి చేసి నిర్దేశించిన మేరకు రా, బాయిల్డ్ రైస్‌ను ఎఫ్‌సీఐకి లెవీ పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గోనె సంచులు, ఇతరత్రా సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎస్‌వో వసంతలక్ష్మి, వ్యవసాయశాఖ జేడీ ఉషాదయాల్, సహకారశాఖ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# 'పీఎం-కిసాన్' కింద 8వ విడత నిధులు విడుదల చేసిన ప్రధానమంత్రి

హైదరాబాద్ , మే 15: "ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి" (పీఎం-కిసాన్) పథకం కింద ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ 9,50,67,601 మంది రైతులకు 8వ విడతగా రూ.2,06,67,75,66,000 మేర నిధులు విడుదల చేశారు. దృశ్య-శ్రవణ మాధ్యమంద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి పలువురు రైతులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులతో ముచ్చటించిన సందర్భంగా- ఉత్తరప్రదేశ్‌లోని 'ఉన్నావ్' ప్రాంతంలో యువ రైతులకు సేంద్రియ వ్యవసాయంతోపాటు, కొత్త వ్యవసాయ పద్ధతులు పాటించడంలో శిక్షణ ఇస్తున్న రైతు అరవింద్‌ను ప్రధానమంత్రి ప్రశంసించారు. అలాగే అండమాన్-నికోబార్ దీవులలో భారీస్థాయిన సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పాట్రిక్‌ను ఆయన కొనియాడారు. వీరితోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో 170 మంది ఆదివాసీ రైతులకు వ్యవసాయంలో మార్గదర్శనం చేస్తున్న ఎన్.వెన్నూరమ్మ కృషిని ప్రధాని అభినందించారు. మేఘాలయలోని కొండ ప్రాంతాల్లో అల్లం పొడి, పసుపు, దాల్చిన చెక్క తదితర సుగంధ ద్రవ్యాలను ఉత్పత్తి చేస్తున్న రైతు 'రెవిస్టర్' నైపుణ్యాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ ప్రాంతంలో సేంద్రియ విధానాల ద్వారా క్యాప్సికం, పచ్చిమిరప, దోస వంటి పంటలు పండిస్తున్న రైతు ఖుర్షీద్ అహ్మద్‌తోనూ ప్రధానమంత్రి సంభాషించారు.

ప్రధానమంత్రి రైతులతో మాట్లాడిన సందర్భంగా- 'పీఎం-కిసాన్' పథకం కింద పశ్చిమ బెంగాల్ రైతులు తొలిసారి లబ్ధి పొందనున్నారని వెల్లడించారు. ప్రస్తుత మహమ్మారి పరిస్థితుల్లో కూడా ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలను రికార్డు స్థాయిలో పండించిన రైతుల కృషిని ఆయన కొనియాడారు.

వారికి శ్రమకు ఫలితం దక్కేవిధంగా ప్రభుత్వం కూడా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం కూడా ఏటా కొత్త రికార్డులు సృష్టిస్తున్నదని చెప్పారు. ఈ మేరకు 'ఎంఎస్‌పీ'తో ధాన్యం సేకరణలో కొత్త రికార్డు నెలకొనగా, ప్రస్తుతం గోధుమ కొనుగోళ్లు కూడా కొత్త రికార్డుల దిశగా సాగుతున్నాయని వివరించారు. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటిదాకా 'ఎంఎస్‌పీ'తో కొనుగోళ్లు 10 శాతం అదనంగా నమోదైనట్లు తెలిపారు. ఇందులో భాగంగా నేటివరకూ సేకరించిన గోధుమ పంటకు చెల్లింపుల కింద రూ.58,000 కోట్ల మేర రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అయిందని వెల్లడించారు.

వ్యవసాయంలో కొత్త సాధనాలు, సరికొత్త మార్గాలను రైతులకు చేరువ చేయడం కోసం ప్రభుత్వం నిరంతర ప్రయత్నిస్తున్నదని ప్రధానమంత్రి తెలిపారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కూడా ఇందులో భాగంగా ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం మరింత లాభదాయకం కావడంతో దేశవ్యాప్తంగా యువరైతులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. ఆ మేరకు గంగానదీ తీరంలో రెండువైపులా దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలో సేంద్రియ వ్యవసాయం చురుగ్గా సాగుతున్నదని, తద్వారా పవిత్ర గంగానది పరిశుభ్రంగా ఉంటుందని ఆయన చెప్పారు.

కోవిడ్-19 మహమ్మారి సమయంలో 'కిసాన్ క్రెడిట్ కార్డు'ల గడువును పొడిగించినట్లు ప్రధానమంత్రి తెలిపారు. తదనుగుణంగా వాయిదాల చెల్లింపు గడువును జూన్ 30దాకా నవీకరించే వీలుందని చెప్పారు. ఇటీవలి సంవత్సరాల్లో 2 కోట్లకుపైగా కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

శతాబ్దానికోసారి దాపురించే మహమ్మారి మన కళ్లకు కనిపించని శత్రువులా నేడు ప్రపంచానికి సవాళ్లు విసురుతున్నదని ప్రధానమంత్రి చెప్పారు. కోవిడ్-19 మహమ్మారిపై ప్రభుత్వం సర్వశక్తులూ కూడదీసుకుని పోరాడుతున్నదని ఆయన తెలిపారు. జాతి జనుల కష్టాలు తీర్చడానికి భరోసా ఇస్తూ ప్రభుత్వంలోని ప్రతి శాఖ రాత్రింబవళ్లు శ్రమిస్తున్నదని చెప్పారు.

దేశంలో మరింతమందికి వేగంగా టీకా వేసేదిశగా కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం సంయుక్తంగా కృషి చేస్తున్నాయని ప్రధానమంత్రి చెప్పారు. ఈ మేరకు ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 18 కోట్ల టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. అలాగే దేశమంతటా ప్రభుత్వ ఆస్పత్రులలో టీకాలు ఉచితంగానే ఇస్తున్నట్లు గుర్తుచేశారు. టీకా కోసం ప్రతి ఒక్కరూ నమోదు చేసుకుని, వేయించుకోవాలని, ఆ తర్వాత కూడా కోవిడ్ అనుగుణ ప్రవర్తన పద్ధతులను ఎల్లవేళలా పాటించాలని ప్రధానమంత్రి సూచించారు. కరోనాపై పోరాటంలో ఈ టీకా అత్యంత కీలక ఆయుధమని, దీనివల్ల తీవ్ర అనారోగ్యం ముప్పు తప్పుతుందని ఆయన వివరించారు.

ప్రస్తుత కష్టకాలంలో ప్రాణవాయువు సరఫరాకు భరోసా ఇస్తూ దేశ సాయుధ బలగాలు సంపూర్ణ సామర్థ్యంతో కృషి చేస్తున్నాయని ప్రధానమంత్రి చెప్పారు. అలాగే రైల్వేశాఖ ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నదని తెలిపారు. మరోవైపు దేశ ఔషధ రంగం భారీఎత్తున మందులు తయారీచేస్తూ సకాలంలో సరఫరా చేస్తున్నదని చెప్పారు. మందులు, ఇతర సరఫరాల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు కఠిన చట్టాలను ప్రయోగించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రధాని కోరారు.

అత్యంత కఠిన పరిస్థితులు ఎదురైనా భారత జాతి ఆత్మవిశ్వాసం కోల్పోదని ప్రధానమంత్రి దృఢంగా ప్రకటించారు.

ఆ మేరకు సంపూర్ణ శక్తియుక్తులతోపాటు అకుంఠిత దీక్షతో ఈ సవాలును అధిగమించగలదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ కోవిడ్-19 వ్యాప్తి గురించి ఆయన హెచ్చరిస్తూ- ఆయా పంచాయతీల్లో ప్రజలకు సరైన అవగాహన కల్పించడంతోపాటు పారిశుధ్యం, పరిశుభ్రత దిశగా పాలన మండళ్లు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

# 20 రోజులలో 126 మెట్రిక్ టన్నుల నుంచి 7900 మెట్రిక్ టన్నులు

## 24 ఏప్రిల్‌న తొలి బట్వాడాతో ప్రారంభించి 12 రాష్ట్రాలకు ఆక్సిజన్ సహాయాన్ని అందించేందుకు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ కార్యకలాపాలను పెంచిన రైల్వేలు

**-40 మెట్రిక్ టన్నుల ఎల్ఎంఒతో ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరుకు ప్రయాణిస్తున్న తొలి ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్**
**-118 ఎంటిల ఎల్ఎంఒతో కేరళలోని ఎర్నాకులంకు బయిలు దేరిన తొలి ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్**
**-80ఎంటిల ఆక్సిజన్‌ను తమిళనాడుకు బట్వాడా చేసిన తొలి ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్**
**-ప్రస్తుతం దేశంలో రోజుకు 800 ఎంటిల ఎల్ఎంఒను బట్వాడా చేస్తున్న ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు**
**-ఉత్తరాఖండ్, కర్నాటక, మహారాష్ట్ర, ఎంపి, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ, యుపిలకు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌ల ద్వారా ఆక్సిజన్ చేరవేత**

హైదరాబాద్ , మే 15: నేటివరకు 462 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను మహారాష్ట్రలో దించగా, 2210 ఎంటిలు యుపిలో, 408 ఎంటీలు ఎంపిలో, 1228 ఎంటీలు హర్యానాలో, 308 ఎంటిలు తెలంగాణలో, 72 ఎంటీలు రాజస్థాన్‌లో, 120 ఎంటీలు కర్నాటకలో, 80 ఎంటీలు ఉత్తరాఖండ్‌లో, 80 ఎంటీలు తమిళనాడులో, 2934 ఎంటీలకు పైగా ఢిల్లీలో అందించాయి

అన్ని ఆటంకాలను అధిగమించి, నూతన కొత్త పరిష్కారాలను కనుగొంటూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకుద్రవ రూపంలోని మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఒ) ను పంపిణీ చేయడం ద్వారా ఊరటను కలిగించే ప్రయాణాన్ని భారతీయ రైల్వే కొనసాగిస్తోంది. ఇంతవరకూ భారతీయ రైల్వేలు దాదాపు 500 ట్యాంకర్ల ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు సుమారు 7900 మెట్రిక్ టన్నుల ఎల్ఎంఒను బట్వాడా చేసింది.గత కొన్ని రోజులుగా ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌ల ద్వారా ప్రతి రోజూ దాదాపు 800 మెట్రిక్ టన్నుల ఎల్ఎంఒను బట్వాడా చేస్తోంది.

ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్‌లు 20 రోజుల కింద నుంచి, అంటే 24 ఏప్రిల్ 2021న మహారాష్ట్ర నుంచి 120 మెట్రిక్ టన్నుల ఎల్ఎంఒను బట్వాడా చేయడం ద్వారా తన అందచేతలను ప్రారంభించింది.

కేవలం 20రోజులలో రైల్వేలు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ కార్యకలాపాలను 12 రాష్ట్రాలకు దాదాపు 7900 మెట్రిక్ టన్నుల ద్రవరూపంలోని ఆక్సిజన్ ను బట్వాడా చేయడం ద్వారా పెంచింది.

దేశం నలుమూలలా ప్రయాణిస్తూ, పశ్చిమంలోని హాపాద ముంద్రా, తూర్పులో ఉన్న రూర్కెలా, దుర్గాపూర్, టాటానగర్, అంగల్ వంటి ప్రాంతాల నుంచి ఆక్సిజన్ ను తీసుకొని ఉత్తరాఖండ్, కర్నాటక, మహారాష్ట్ర, ఎంపి, ఆంధ్రప్రదేశ్, తమిళ్‌నాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ, యుపి వంటి రాష్ట్రాలకు బట్వాడా చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని సంక్లిష్ట కార్యకలాప మార్గానికి ప్రణాళికలు వేసుకొని నిర్వహిస్తోంది.

సాధ్యమైనంత త్వరగా ఆక్సిజన్ సహాయం అందించేందుకు రైల్వేలు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ సరుకు రవాణా రైళ్ళను నడిపేందుకు నూతన ప్రమాణాలు, ముందెన్నడూ లేని బెంచ్ మార్కులను సృష్టిస్తోంది. కీలకమైన ఈ సరుకు రవాణా రైళ్ళు దీర్ఘ దూరాలు వెళ్ళేటపుడు సగటే వేగం గంటకు 55 కిలోమీటర్లకుపైన ఉంటుంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన గ్రీన్ కారిడార్‌లో అత్యంత ప్రాధాన్యత భావనతో నడిపేటప్పుడు, వివిధ జోన్లకు చెందిన కార్యాచరణ బృందాలు ఆక్సిజన్ గమ్యానికి అతితక్కువ సమయంలో చేరుకునేందుకు రోజులో 24 గంటలూ అత్యంత సవాళ్ళను ఎదుర్కొనే పరిస్థితుల్లో పని చేస్తున్నారు. సిబ్బంది వివిధ సెక్షన్లలో మారుతుండడంతో సాంకేతిక నిలుపుదలలు ఒక నిమిషానికి తగ్గాయి.

ఆక్సిజన్ రైళ్ళు నిరాటంకంగా పరుగులు తీసేందుకు అత్యంత అప్రమత్తంగా ఉంటూ పట్టాలను ఆటంకాలు లేకుండా ఉంచుతున్నారు.

ఇతర సరుకు రవాణా వేగం తగ్గకుండా ఉండే విదంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.

విడుదల సిద్ధం అవుతుండడంతో, ఆంధ్ర ప్రదేశ్ కేరళ రాష్ట్రాలకు తొలి ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు 40 మెట్రిక్ టన్నులు, 118 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ మోసుకుని వెళుతున్నాయి.

తమిళనాడుకు తొలి ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ 80 ఎంటిల ఆక్సిజన్‌ను శుక్రవారం బట్వాడా చేసింది, రెండవ ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది.

ఇప్పటి వరకూ 130 ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ తమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని, వివిధ రాష్ట్రాలకు ఉపశమనాన్ని కల్పించాయి.

ఆక్సిజన్ కోరుతున్న రాష్ట్రాలకు సాధ్యమైనంత తక్కువ సమయంలో సాధ్యమైనంత ఎల్ఎంఒను బట్వాడా చేసేందుకు భారతీయ రైల్వేలు కృషి చేస్తోంది.

ఈ ప్రకటన వెలువడే సమయానికి, 462 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను మహారాష్ట్రలో దించగా, 2210 ఎంటిలు యుపిలో, 408 ఎంటీలు ఎంపిలో, 1228 ఎంటీలు హర్యానాలో, 308 ఎంటిలు తెలంగాణలో, 72 ఎంటీలు రాజస్థాన్‌లో, 120 ఎంటీలు కర్నాటకలో, 80 ఎంటీలు ఉత్తరాఖండ్‌లో, 80 ఎంటీలు తమిళనాడులో, 2934 ఎంటీలకు పైగా ఢిల్లీలో దించాయి. తాజా ఆక్సిజన్‌ను రవాణా చేయడం అనేది క్రియాశీల వ్యాయామం, గణాంకాలు ఎప్పటికప్పుడూ తాజా పరుస్తున్నారు. ఆక్సిజన్ నింపిన ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు తమ ప్రయాణాన్ని ఈ రాత్రి నుంచి ప్రారంభించనున్నాయి.

ఆక్సిజన్ సరఫరా చేసే ప్రాంతాలకు భిన్నమైన మార్గాలను సిద్ధం చేసి, రాష్ట్రాలకు అవసరం తలెత్తుతున్నప్పుడు ప్రయాణానికి సిద్ధంగా రైల్వేలు సిద్ధంగా ఉంది. ఎల్ఎంఒను తీసుకువచ్చేందుకు రాష్ట్రాలు భారతీయ రైల్వేకు ట్యాంకర్లను అందిస్తున్నాయి.

# కోవిడ్‌పై పోరులో చేతులు కలిపిన జనఔషధి కేంద్రాలు, బి.పి.పి.ఐ.!

హైదరాబాద్ , మే 15: దేశంలో కోవిడ్-19 మహమ్మారి ఉధృతిని కట్టడి చేయడంలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు (పి.ఎం.బి.జె.కె.లు), ఔషధ ప్రభుత్వ రంగ సంస్థల విభాగం (బి.పి.పి.ఐ.), పంపిణీ దార్లు, ఇతర భాగస్వామ్యవర్గాలు సమష్టిగా పోరాటం సాగిస్తూ వస్తున్నాయి.

ఈ పోరాటంలో భాగంగా ఈ ఏడాది మే నెల 13వ తేదీనాటికి దేశంలో 7,733 పి.ఎం.బి.జె.కె.లు పనిచేస్తూ ఉన్నాయి. ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన పథకం (పి.ఎం.బి.జె.పి.) కింద, 36రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని అన్ని జిల్లాల్లోనూ ఈ కేంద్రాలు తమ విధులను నిర్వహిస్తూ ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా 1,449 రకాల మందులు, 204రకాల సర్జికల్ పరికరాలు, వినియోగ వస్తువులను విక్రయిస్తున్నారు. అత్యవసరమైన మందులు, ఫేస్ మాస్కులు, శానిటైజర్లు వంటివి దేశవ్యాప్తంగా ఈ కేంద్రాల ద్వారా సులభంగా అందుబాటులోకి తెచ్చారు. పి.ఎం.బి.జె.పి. పథకం కింద అత్యుత్తమ నాణ్యత కలిగిన ఫేస్ మాస్కులను ఈ కేంద్రాల్లో ఒక్కొక్కటి 25 రూపాయల ధరకే విక్రయిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2021-22)లో, ఈ ఏడాది ఏప్రిల్ 13వ తేదీ నాటికి బి.పి.పి.ఐ. రూ. 80.18 కోట్ల విలువైన అమ్మకాలు జరిపింది. దీనితో దేశ పౌరులకు మందులపై దాదాపు రూ. 500కోట్ల మేర ఆదా అయ్యింది.

ఆయా కేంద్రాలకు మందుల సరఫరాకు సంబంధించిన రవాణా, తదితర మౌలిక సదుపాయాల వ్యవస్థను కూడా ఇపుడు బలోపేతం చేస్తున్నారు. ప్రస్తుతం గురుగ్రామ్, గువాహటి, చెన్నై ప్రాంతాల్లోని మూడు అధునాతన గిడ్డంగులు మందుల నిల్వకు, పంపిణీకి ఉపయోగపడుతున్నాయి. సూరత్ లో నాలుగవ అధునాతన గిడ్డంగి కూడా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఇక దేశంలో మారుమూలన ఉన్న ప్రాంతాలకు, సుదూర గ్రామీణ ప్రాంతాలకు మందుల సరఫరా కోసం 37 పంపిణీ సంస్థలను కూడా నియమించారు.

2020-21వ సంవత్సరంలో కోవిడ్ వైరస్ వ్యాప్తి సమస్య మొదలైనపుడు ప్రధానమంత్రి జన ఔషధి పరియోజన పథకం (పి.ఎం.బి.జె.పి.) దేశానికి అత్యంత ఆవశ్యకమైన సేవలను అందించింది. లాక్ డౌన్ సమయంలో కూడా ఈ విక్రయ కేంద్రాలు (స్టోర్లు) పనిచేశాయి. నిత్యావసర మందులు నిరాటంకంగా అందుబాటులో ఉండేలా కార్యకలాపాలను నిర్వహించాయి. పి.ఎం.బి.జె.పి. పథకం కింద సరఫరా చేసే మందుల ధరలను మూడు అగ్రశ్రేణి బ్రాండులకు చెందిన మందుల సగటు ఖరీదులో గరిష్టంగా 50శాతంగా నిర్ణయించారు. దీనితో, ఔషధి మందుల ధర ఇతర మందులతో పోల్చితే కనీసం 50 శాతం తక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భంగాల్లో బ్రాండెడ్ మందుల మార్కెట్ ధర కంటే 80నుంచి 90శాతం వరకు తక్కువగా కూడా ఉంటుంది.

2020-21 ఆర్థిక సంవత్సరంలో లాక్ డౌన్, తదితర ఆంక్షలు ఎదురైనప్పటికీ, బి.పి.పి.ఐ. గణనీయమైన స్థాయిలో అమ్మకాలను నమోదు చేసింది. రూ. 665.83 కోట్ల మేర వ్యాపారాన్ని సాగించింది. దీనితో దేశంలోని సామాన్య పౌరులు మందులపై దాదాపు రూ. 4,000కోట్ల మేర ఖర్చును ఆదా చేయగలిగారు. ప్రజలకు అత్యవసరమైన, డిమాండ్ ఎక్కువగా ఉన్న ఫేస్ మాస్కులు, హైడ్రాక్సీ క్లోరోక్విన్, ప్యారాసిటమాల్, అజిత్రో మైసిన్ వంటి మందులు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా బి.పి.పి.ఐ. చర్యలు తీసుకుంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 25లక్షల ఫేస్ మాస్కులను, లక్షా 25వేల శానిటైజర్లను, కోటీ 37 లక్షల హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలను, 32కోట్ల ప్యారాసిటమాల్ మాత్రలను బి.పి.పి.ఐ. విక్రయించింది. దేశవ్యాప్తంగా పనిచేసే 7,500కిపైగా జన ఔషధి కేంద్రాల ద్వారా అందుబాటు ధరల్లో వీటిని విక్రయించింది. ఇక ప్రపంచంలోని మన మిత్ర దేశాల్లో పంపిణీ కోసం రూ. 30 కోట్ల విలువైన మందులను విదేశాంగ మంత్రిత్వ శాఖకు కూడా బి.పి.పి.ఐ. సరఫరా చేసింది. కోవిడ్ చికిత్సలో వినియోగించే చాలా వరకు మందులతోపాటు, ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించే పలు రకాల మందులన్నీ పి.ఎం.బి.జె.పి. పరిధిలోకి తీసుకువచ్చారు. మహిళలు, పిల్లలతో సహా అందరికీ వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడానికి దోహదపడే అనేక పౌష్టికాహార ఉత్పాదనలను కూడా పి.ఎం.బి.జె.పి. తన పరిధిలోని విక్రయ జాబితాలో చేర్చింది. ఈ ఉత్పాదనలన్నింటినీ మార్కెట్ ధరలతో పోల్చితే 50నుంచి 90శాతం తక్కువ ధరల్లోని పి.ఎం.బి.జె.పి. పరిధిలో అందుబాటులో ఉంచారు.

గత ఏడాది, లాక్ డౌన్ సమయంలో కూడా ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు తమ సేవలను అందించాయి. సామాన్య ప్రజలందరికీ నాణ్యమైన జనరిక్ మందులను అందుబాటు ధరల్లో ఇంటి ముంగిళ్ల వద్దకే సరఫరా చేశాయి. "స్వస్థకీ సిపాహీ" లుగా ప్రజల్లో పేరు పొందిన ఈ కేంద్రాల ఫార్మాసిస్టులు వయో వృద్ధులైన రోగులకు ఇళ్ల ముంగిళ్లకే మందులను సరఫరా చేశారు.

# తడిసిన ధాన్యాన్ని కొంటాం : మంత్రి ఎర్రబెల్లి



జనగామ మే 15: తడిసిన ధాన్యాన్ని కొంటామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులతో కొవిడ్ నియంత్రణ చర్యలు, యాసంగి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 195 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రోజుకు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో ఎటువంటి సహాయం చేయట్లేదన్నారు.

కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రూ.30 వేల కోట్లు అప్పు తీసుకొని రైతుల ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఇప్పటివరకు 12 వేల 224 మంది రైతుల నుంచి 73 వేల 886 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు.5 వేల 542 మంది రైతుల ఖాతాలకు రూ. 57 కోట్ల 9 లక్షల 96 వేలు జమచేసినట్లు ఆయన తెలిపారు. రైతులు సంయమనంతో ఓపిక పట్టాలని, కొంత ఆలస్యమైనా పండించిన చివరి గింజ కొంటామని మంత్రి తెలిపారు.రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. గుండెపోటుతో ఆకస్మిక మరణం పొందిన జర్నలిస్ట్ పాపయ్య కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు.

# ఈ నెల 17న రాష్ట్రాల విద్యాశాఖ కార్యదర్శులతో కేంద్రమంత్రి భేటీ

న్యూఢిల్లీ, మే 15: కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ ఈ నెల 17న అన్ని రాష్ట్రాల విద్యాశాఖ కార్యదర్శులతో సమావేశంకానున్నారు. ఈ సందర్భంగా విద్యారంగంపై కొవిడ్ మహమ్మారి ప్రభావంపై సమీక్షించనున్నారు. వర్చువల్ విధానంలోనే జరిగే సమావేశంలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించడం, నూతన జాతీయ విద్యా విధానం అమలుపై సమీక్ష జరుపనున్నారు. కరోనా సెకండ్ వేవ్ తర్వాత రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శులతో కేంద్ర విద్యాశాఖ మంత్రి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారని సంబంధిత శాఖ వర్గాలు పేర్కొన్నాయి. కొవిడ్-19ను ఎదుర్కొవడానికి రాష్ట్ర విద్యాశాఖలు చేసిన సన్నాహాలు, మహమ్మారి సమయంలోనూ ఆన్‌లైన్ విద్యను ఎలా కొనసాగించవచ్చో కేంద్రమంత్రి సమీక్ష నిర్వహిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కొవిడ్-19 సెకండ్ వేవ్ నేపథ్యంలో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ 10వ తరగతి సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షను రద్దు చేయగా.. 12వ తరగతి సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షను వాయిదా వేసింది. మేలో జరగాల్సిన ఉన్నత విద్య అన్ని పరీక్షలను సైతం మంత్రిత్వ శాఖ వాయిదా వేసింది.

# వేములవాడలో ఘనంగా ఈదుల్ ఫితర్ వేడుకలు

## -కరోనా తొలగిపోవాలని రమజాన్ రోజు ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు




రాజన్న సిరిసిల్ల మే, 15(నేటినిజం ప్రతినిధి): ముస్లిం సోదరుల పవిత్ర మాసమైన రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ముగించుకొని శుక్రవారం -మండలంలోని అన్ని గ్రామాల్లో ఈదుల్ ఫితర్ రమజాన్ వేడుకలు అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు రాష్ట్ర ప్రభుత్వం విధించిన నియమ నిబంధనల ప్రకారం ముస్లిం సోదరులంతా తమ ఇండ్లలోనే ఈద్ నమాజ్ ను పూర్తి చేసుకున్నారు.. మస్జిద్ లలో 5గురితో మాత్రమే ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ ను ఆచరించారు. ఈద్గాహ్ లు జన సందడి లేక వెల వెలబోయాయి.వేములవాడ పట్టణంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ సర్వర్ అలీ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్ ,కౌన్సిలర్ మొహమ్మద్ సలీమ్ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా,సీనియర్ జర్నలిస్ట్,సీనియర్ జర్నలిస్ట్ జిల్లా కరాటే అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మన్నాన్ ,సీనియర్ జర్నలిస్టులు తాహెర్ పాషా ,హబీబ్ పాషా ,ఆర్.కె.యూసఫ్ ,ఖాజా నయిమొద్దీన్ ,నవాబ్ ఖాన్ రసూల్,కలీమ్,మహమ్మద్ రఫీక్,మహమ్మదీయ మజీద్ సదర్ షేక్ ఇమామ్ ,ముస్లిం మైనారిటీ యూత్ నాయకులు షేక్ రియాజ్ ఇంతియాజ్ రాహిల్ , ఎంఎ రఫీక్ ఇంట్లోని కుటుంబ సభ్యులతో నమోదు చేసుకొని ఒకరి నొకరు ఆత్మీయంగా ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు దూరంగా ఉంటూ తెలియజేసుకున్నారు. వేములవాడ పట్టణంలో 5 మస్జిద్ లో అలాగే మండలంలోని నాంపెల్లి ఇస్లామ్ నగర్ , శాత్రాజపల్లి ,ఫాజుల్ నగర్ గ్రామలలోని మస్జిద్ లో మత గురువులైనమౌల్వీలను ప్రవక్త బోధనల సారాన్ని, రమజాన్ మాసం ప్రత్యేకతను, ఈదుల్ ఫితర్ పండుగ సందేశాన్ని చదివి వినిపించారు. అరబ్బీ ఖుత్బా చదివిన తర్వాత, 6 తక్బీర్ లతో ఈద్ నమాజ్ చదివించి.. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కరోనా వ్యాధి భూ ప్రపంచం నుండి తొలగించాలని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు మునుపటి లాగా సుఖ సంతోషాలతో జీవించాలని అల్లాహ్ తో దుఆ చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ యూనియన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా ,సీనియర్ జర్నలిస్ట్ , సీనియర్ కరాటే మాస్టర్ మన్నాన్,ముస్లిం మైనారిటీ యూత్ నాయకుడు షేక్ రియాజ్ మాట్లాడుతూకరువు మహమ్మారిని తరిమి కొట్టే యుద్ధంలో కులమతాలకతీతంగా ప్రాంతీ కతీతంగా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు వ్యక్తిగత దూరాన్ని పాటిస్తూ మాస్కులు తప్పనిసరిగా ధరించాలని సానిటైజర్లు తప్పకుండా వినియోగించాలని సూచించారు.దేశ ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు వేములవాడ సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు మస్జిద్‌లు వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు .ఈ పండుగలో బంధువులు మిత్రులు ఫోన్ ద్వారా వాట్సాప్ ద్వారా ఒకరికొకరు శుభాకాంక్షలుతెలుపుకున్నారు ఈకార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

# కొచ్చి రిఫైనరీ ప్రాంగణంలో ఈ రోజు ప్రారంభమైన - మెగా కోవిడ్ సంరక్షణ కేంద్రం

హైదరాబాద్ , మే 15: కేరళలోని అంబాలముగల్‌లో బి.పి.సి.ఎల్.కు చెందిన కొచ్చి రిఫైనరీ నిర్వహిస్తున్న పాఠశాల వద్ద, దాని ప్రాంగణానికి ఆనుకొని 100 పడకల భారీ కోవిడ్ చికిత్సా కేంద్రం ఈ రోజు ప్రారంభమైంది. భారత ప్రభుత్వ పెట్రోలియం మరియు సహజవాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని 'మహారత్న' పి.ఎస్.యు., భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బి.పి.సి.ఎల్), ఈ కేంద్రానికి ఆక్సిజన్, విద్యుత్తు, నీటి సరఫరా లను ఉచితంగా అందిస్తోంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టెయిన్లెస్ స్టీల్ గొట్టాల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం, మొదటి దశలో 100 పడకలతో వైద్య సదుపాయం కల్పించారు. క్రమంగా, అదే ప్రాంగణంలో, ఈ వైద్య సదుపాయాన్ని 1,500 పడకలకు విస్తరించనున్నారు.

ప్రతి నెలా కొచ్చి రిఫైనరీ నుండి 100 మెట్రిక్ టన్నుల ద్రవ ఆక్సిజన్ను సరఫరా చేయడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కేంద్రాలకు నెలకు 600 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వాయువును ఉచితంగా సరఫరా చేయడానికి ముంబై మరియు బినా లోని చమురు శుద్ధి కర్మాగారాల్లో సౌకర్యాల స్థాయిని పెంచడం ద్వారా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ కు మద్దతు ఇవ్వడంలో భారత్ పెట్రోలియం ముందంజలో ఉంది.

మహారాష్ట్రలోని రెండు ప్రభుత్వ ఆసుపత్రులలో, కేరళలోని మూడు ఆస్పత్రులు, మధ్యప్రదేశ్‌లోని ఐదు ఆసుపత్రులలో కూడా పి.ఎస్.ఎ. ఆక్సిజన్ ప్లాంట్లను బి.పి.సి.ఎల్. ఏర్పాటు చేస్తోంది. వీటికి అదనంగా, రిఫైనరీ వద్ద బాట్లింగ్ కంప్రెసర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సిలిండర్ల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేయడానికి ఇది సహాయపడుతుంది.

ఈ సందర్భంగా బి.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కొచ్చి రిఫైనరీ) శ్రీ సంజయ్ ఖన్నా మాట్లాడుతూ, "ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సమాజానికి తగిన సహాయం అందించడానికి, భారత్ పెట్రోలియం సంస్థ, ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. మా ప్రాంగణంలో కోవిడ్ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ఉచితంగా ఆక్సిజన్, ఇతర సదుపాయాలను కల్పించడం, దేశ ప్రజల జీవితాలను శక్తివంతం చేయాలన్న మా ప్రధాన ప్రయోజనం పట్ల మా నిబద్ధతలో ఒక భాగం. మా ఆక్సిజన్ ఉత్పత్తి సౌకర్యాన్ని, అతి తక్కువ సమయంలో, అభివృద్ధి చేయడం ఒక సవాలే, అయితే, మేము, ఈ మొత్తం కార్యాచరణను ఐదు రోజుల్లో పూర్తి చేయగలం." అని పేర్కొన్నారు.

# మరింత పకడ్బందీగా లాక్‌డౌన్



నల్లగొండ, మే 15: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడో రోజూ లాక్‌డౌన్ కట్టుదిట్టంగా అమలైంది. ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు సడలింపులో మినహా మిగతా సమయంలో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. నిత్యావసరాలు, ఇతర సామగ్రి తదితరాల కొనుగోలు కోసం ఉదయం 10గంటల వరకు ప్రజలు రోడ్లపైకి రావడంతో రద్దీ నెలకొంది. ప్రజలు కూరగాయలు, కిరాణం, మందుల లాంటి నిత్యావసర వస్తువుల కొనుగోలుకే ఎక్కువగా ప్రాధాన్యనిస్తున్నారు. నిర్ణీత సమయం ముగిశాక తిరిగి షాపులు మూతపడడం ప్రజలు ఇంటిబాట పట్టారు. పోలీసు పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం తిరుగుతూ దుకాణాలను మూసివేయాలని విజ&జప్తి చేస్తూ కనిపించాయి. 10 తర్వాత ఇండ్లల్లోనే ఉండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా బోసిపోయాయి.

అత్యవసరాలకు అనుమతి..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులూ లేవు. ధాన్యం అమ్మకాలు, ఎరువులు, విత్తనాల కొనుగోలుకు కూడా ఆటంకాలు లేకుండా పోలీసులు వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బందిని గుర్తింపు కార్డులు చూపిస్తే అనుమతిస్తున్నారు. లాక్‌డౌన్ నిబంధనల ప్రకారం పక్కాగా వ్యవహరించే దిశగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో పోలీసు చెక్‌పోస్టులను మరింత కట్టుదిట్టం చేశారు. ఉదయం పూట సడలింపుల సమయంలోనూ వాహనాలను అనుమతించలేదు. ముందస్తు అనుమతి లేకుంటే రావడానికి వీలు లేదని పోలీసులు స్పష్టం చేశారు. లాక్‌డౌన్ సడలింపులు కేవలం తెలంగాణ వాసులకేనని ఆంధ్ర నుంచి వస్తున్న వాహనదారులకు పోలీసులు వెల్లడించారు. దీంతో కొద్దిసేపు ఆంధ్రవైపు వాహనాల రద్దీ నెలకొంది. తర్వాత వాహనదారులు వెనక్కి వెళ్లిపోవడంతో సాధారణ పరిస్థితులు కొనసాగాయి. నాగార్జునసాగర్ పరిధిలోని కొత్త బ్రిడ్జి వద్ద ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. కొవిడ్ చికిత్స మినహా మిగతా వ్యాధుల విషయంలో రోగులతో వచ్చిన అంబులెన్స్‌లను పోలీసులు అనుమతించారు. కానీ కొవిడ్ చికిత్స విషయంలో కొవిడ్ కమాండ్ కంట్రోల్ నుంచి జారీ చేసిన పాసులు ఉంటేనే అంబులెన్స్‌లను హైదరాబాద్‌కు వెళ్లనిచ్చారు. ఇక నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై దామరచర్ల మండలం వాడపల్లి వద్ద, కోదాడ మండలం రామాపురం వద్ద కూడా అనుమతి ఉంటేనే తెలంగాణ రాష్ట్రంలోకి రానిచ్చారు.వాడపల్లి వద్ద పరిస్థితిని నల్లగొండ జిల్లా ఎస్పీ రంగనాథ్ సమీక్షించారు. చెక్‌పోస్టు పోలీసులకు తగిన సూచనలు ఇస్తూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆదేశించారు.

## ఢిల్లీలో ఆయుష్ -64 ఉచిత పంపిణీ కేంద్రాల సంఖ్య 25 స్థానాలకు పెంపు

హైదరాబాద్ , మే 15: జాతీయ రాజధాని ఢిల్లీలో ఆయుష్ 64 మరియు కబసుర కుడినిర్ ఉచిత పంపిణీ కేంద్రాలను ఆయుష్ మంత్రిత్వ శాఖ విస్తృతం చేసింది. కార్యక్రమంలో భాగంగా సేవా భారతి సంస్థ శుక్రవారం నుండి ఢిల్లీలోని 17 ప్రాంతాల్లో ఆయుష్ -64 పంపిణీ ప్రారంభించింది. రెండు రోజుల వ్యవధిలో ఈ సంఖ్య 30 దాటవచ్చని భావిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా లేదా ప్రభుత్వ / ఎన్జీఓ ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్లలో నివసిస్తున్న కొవిడ్-19 రోగులు ఆయుష్ మంత్రిత్వ శాఖ చొరవ ద్వారా లబ్ది పొందుతున్నారు. ఉచిత పంపిణీ కార్యక్రమం 20 కి పైగా రాష్ట్రాలకు చేరుకుంది మరియు ఇంట్రా స్టేట్ రీచ్ నిరంతర ప్రాతిపదికన విస్తరిస్తోంది.

ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద 24బీ7 ఉచిత పంపిణీ కౌంటర్‌ను ప్రారంభించింది. మరో రెండు ఆయుష్ సంస్థలు, సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి, సెక్టార్ -19, రోహిణి మరియు డాక్టర్ డిపి రాస్తోగి సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి సెక్టార్ -24, నోయిడా, ఆసుపత్రిలో లక్షణాలు లేని మరియు తేలికపాటి మితమైన లక్షణాలు కలిగిన కొవిడ్-19 రోగుకు ఆయుష్ -64 పంపిణీ చేయడం ప్రారంభించింది. గత శనివారం ఢిల్లీలోని ఏడు కేంద్రాల ద్వారా ఈ మందుల పంపిణీని మంత్రిత్వ శాఖ ప్రారంభించింది.

శుక్రవారం సేవా భారతి ప్రారంభించిన 17 పంపిణీ కేంద్రాలు షాహదారా, గాంధీ నగర్, ఇంద్రప్రస్థ, హిమ్మత్‌పురి (మయూర్ విహార్ ఫేజ్ -1), కాల్‌కాజీ, బదర్‌పూర్, కరవాల్ నగర్, బ్రహ్మపురి, నంద్ నగ్రి (2), రోహ్తాస్ నగర్, తిలకాపూర్, రోహిణి, కంజావ్లా, నరేలా మరియు బురాడిలో ఉన్నాయి. ఈ కేంద్రాలు వారానికి ఏడు రోజులు ఉదయం 9.30 నుండి సాయంత్రం 4.30 వరకు పనిచేస్తాయి.

ఇవే కాకుండా ఆయుష్ భవన్, బి-బ్లాక్, జిపిఓ కాంప్లెక్స్ రిసెప్షన్ వద్ద సేల్ కౌంటర్ కూడా ఏర్పాటు చేయబడింది. ఇక్కడ ఆయుష్ 64 మరియు ఆయురాక్ష కిట్లు రెండూ అందుబాటులో ఉన్నాయి.

రోగులు లేదా వారి ప్రతినిధులు రోగి యొక్క ఆర్టీ-పీసీఆర్ పాజిటివ్ రిపోర్ట్ లేదా రాపిడ్ యాంటిజెన్ రిపోర్ట్ (ఆర్ఎటి) లేదా హెచ్ఆర్‌సిటి చెస్ట్ రిపోర్ట్ మరియు ఆధార్ కార్డ్ హార్డ్ లేదా సాఫ్ట్ కాపీలు చూపించి ఉచిత ఆయుష్ 64 టాబ్లెట్లను పొందవచ్చు.

ఆయుష్ 64 అనేది పాలీ హెర్బల్ ఫార్ములా. ఇది లక్షణరహిత, తేలికపాటి మరియు మితమైన లక్షణాలున్న కొవిడ్-19 చికిత్సలో ఉపయోగకరంగా ఉంటుంది. ఆయుర్వేదం మరియు యోగా ఆధారంగా నేషనల్ క్లినికల్ మేనేజ్‌మెంట్ ప్రోటోకాల్‌లో ఆయుష్ -64 సిఫారసు చేయబడింది. ఇది ఐసిఎంఆర్ యొక్క కోవిడ్ మేనేజ్‌మెంట్‌పై నేషనల్ టాస్క్ ఫోర్స్ మరియు హోం ఐసోలేషన్‌లోని కోవిడ్ -19 రోగులకు ఆయుర్వేద ప్రాక్టీషనర్లకు మార్గదర్శకాలను పరిశీలించింది. ఇది కీలకమైన మల్టీ సెంటర్ క్లినికల్ ట్రయల్ తరువాత కోవిడ్ -19 రోగులకు ప్రామాణిక సంరక్షణకు అనుబంధంగా తయారు చేయబడింది. ఐసిఎంఆర్ మాజీ డిజి డాక్టర్ వి.ఎం.కటోచ్ అధ్యక్షతన ఆయుష్-సిఎస్ఐఆర్ జాయింట్ మానిటరింగ్ కమిటీ మంత్రిత్వ శాఖ క్లినికల్ ట్రయల్ పర్యవేక్షించింది.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ హరిత



వరంగల్ రూరల్ మే 15: జిల్లాలోని వర్ధన్నపేట, పర్వతగిరి, సంగెం మండలాల్లో జిల్లా కలెక్టర్ హరిత పర్యటించారు. వివిధ గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం కొనుగోలుపై రైతులు, నిర్వాహకులు, హమాలీలతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కొవిడ్ నిబంధనలు అమలయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సంపత్ రావు, ఇతర అధికారులు ఉన్నారు.

## గిరిజనులకు వైద్యం ఇబ్బంది రాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి - మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, మే 15: కోవిడ్ మహమ్మారి విజృంభిస్తుండడంతో మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు వైద్యం ఇబ్బంది రాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మహిళలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ ? శిశుసంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. కోవిడ్ పరిస్థితులను ఎప్పటికప్పుడు వీడియో కాన్ఫరెన్సు, టెలి కాన్ఫరెన్సుల ద్వారా పర్యవేక్షిస్తూ, కోవిడ్ వార్డులను సందర్శిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆలోచన మేరకు రోగులకు ధైర్యాన్ని అందిస్తున్నారు. నేడు మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించి కోవిడ్ పరిస్థితులను తెలుసుకున్నారు.

## ఖాళీ సిలిండర్ల కొరత - ఆక్సిజన్ సరఫరాకు బ్రేకులు

హైదరాబాద్ , మే 15: సెకండ్‌వేవ్‌లో ఒక్కసారిగా కొవిడ్ కేసులు పెరిగి ఆక్సిజన్ లభించక పలువురు పేషెంట్‌లు ప్రాణాలు వదలిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో 10 రోజుల క్రితంతో పోలిస్తే ఆక్సిజన్ లభ్యత పెరిగినప్పటికీ ప్రాణవాయువు సరఫరాకు సిలిండర్ల కొరత వేధి స్తోంది. సాధారణంగా రాజధాని హైదరాబాద్ నగరంలో కార్పొరేట్, చిన్న ప్రైవేట్ ఆస్పత్రులు ఆక్సిజన్ కోసం బాలా నగర్, జీడిమెట్ల, మియాపూర్ ప్రాంతాల్లోని ప్రాణవాయువు ను సిలిండర్లలో సరఫరా చేసే ఏజెన్సీల మీద ఆధారపడు తుంటాయి. వారికి అవసరమైన పరిమాణంలో ఆక్సిజన్‌ను ఈ ఏజెన్సీలు రోజువారిగాసిలిండర్లలో నింపి ఆస్పత్రులకు డెలివరీ చేస్తుంటాయి. అయితే గడిచిన నాలుగైదు రోజులుగా ఈ ఏజెన్సీలు తమ క్లైంట్లయిన ప్రైవేట్ ఆస్పత్రులకు ఆక్సిజన్ సరఫరా చేద్దామంటే ఖాళీ సిలిండర్లు దొరకకుండా పోయాయి. అసలు సిలిండర్ల కొరత ఎందుకు ఏర్పడిందా అని ఏజెన్సీలు ఆరాతీయగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గత కొన్ని రోజులుగా చాలా మంది హోం ఐసోలేషన్‌లో ఉన్న కరోనా పేషెంట్‌లు సిలిండర్లను కొనుగోలు చేసి ఆక్సిజన్ నింపుకొని ఇళ్లలోనే ఉంచుకుంటున్నట్లు వారి దృష్టికి వచ్చింది. దీంతో వారు ఇదే విషయాన్ని ఆయా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు చెప్పగా వారు పోలీసులకు ఈ విషయాన్ని చేరవేసినట్లు తెలుస్తోంది. కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులకు ఆక్సిజన్ సరఫరా చేసే ఏజెన్సీలతో ఒప్పందం ఉంటుంది. సెకండ్ వేవ్ ప్రారంభమైనప్పటి నుంచి ఆస్పత్రులు వెంటిలేటర్ బెడ్‌ల సంఖ్య పెంచాయి. ఇందుకు తగ్గట్లుగా ఆక్సిజన్‌ను సరఫరా చేయాల్సిందిగా ఏజెన్సీలను అడిగితే సిలిండర్ల కొరత ఉందని సమాధానం వస్తోంది. ఆస్పత్రుల్లోనేమో చాలా మంది సీరియస్ కండిషన్‌లో ఉన్న పేషెంట్‌లకు ఆక్సిజన్ అందడం లేదు. హైదరాబాద్‌లో చాలా మంది సిలిండర్లను ఇళ్లలో పెట్టుకుని అవసరం ఉన్నా లేకున్నా ఆక్సిజన్‌ను పీల్చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇదే విషయాన్ని మేము పోలీసుల నోటీసుకు తీసుకెళ్లామని ఒక ప్రైవేటు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పేర్కొన్నారు. ఆక్సిజన్ హోల్‌సేల్ వ్యాపారం చేసే ఏజెన్సీలు తమ వద్ద ఒప్పందాలు పోను మిగిలిన ఆక్సిజన్‌ను ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికే ఇస్తున్నాయి. ఉదయం 11 తర్వాత ఆక్సిజన్ సిలిండరే దొరకడం లేదు. సాధారణ పరిస్థితుల్లో ఆక్సిజన్ సిలిండర్ ధర రూ.10వేలు ఉంటే ప్రస్తుతం ఏజెన్సీల వద్దకు వచ్చే వారు ఏకంగా రూ.50 వేల పెట్టి కొనడానికి సిద్దంగా ఉంటున్నారు. దీంతో ఏజెన్సీలు ఎక్కువ ధర ఇచ్చే వారికి సిలిండర్లను ఇచ్చేయడంతో ఆస్పత్రులకు అధిక ఆక్సిజన్ సరఫరా చేయడంలో సమస్య తలెత్తుతోంది. రీఫిల్లింగ్ రూ.250 నుంచి పది రెట్లు పెరిగి రూ.2500 పలుకుతోందంటే పరిస్థితి అర్థమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఆక్సిజన్ సిలిండర్ కోసం చిన్న ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి రోజుకు 10 నుంచి 15 ఫోన్‌లు పేషెంట్ ఎమర్జెన్సీలో ఉన్నాడని మాకు వస్తున్నాయి. అయినా మేమేమి చేయలేకపోతున్నామని ఒక ఆక్సిజన్ సరఫరా చేసే రీటెయిలర్ సిలిండర్ల కొరత సమస్యను వివరిస్తున్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ సిలిండర్లను కొని ఇళ్లలో ఉంచుకోవడం నేరమని పోలీసులు పేర్కొంటున్నారు. ఆక్సిజన్ పూర్తిస్థాయిలో నింపిఉన్న సిలిండర్‌ను ఇంట్లో పెట్టుకోవడం ప్రమాదకరం అని దాని వాడకం సరిగా తెలియకపోతే అది పేలుతుందని వారు హెచ్చరిస్తున్నారు. నగరంలో ఉన్న అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఒక్క వెంటిలేటర్ బెడ్ కూడా ఖాళీగా లేదని ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి వద్ద సిలిండర్లు ఉన్నా వాటిని స్వచ్ఛందంగా మార్కెట్‌లో రొటేషన్‌కు ఇచ్చి వేయాలని లేదంటే వారిపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఎవరెవరు ఇళ్లలో ఆక్సిజన్ సిలిండర్లు హోర్డింగ్ చేశారన్న దానిపై ఇప్పటికే ట్రేస్ చేయడం ప్రారంభించామని వారు చెబుతున్నారు. తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సరఫరా సెకండ్ వేవ్ ప్రారంభంతో పోలిస్తే ప్రస్తుతం చాలా వరకు మెరుగుపడిందని, రాష్ట్రంలో కావాల్సినంత ఆక్సిజన్ అందుబాటులో ఉందని ఓ ప్రభుత్వ కొవిడ్ కేర్ ఆస్పత్రి వైద్యుడు తెలిపారు.

# భాగస్వామ్య సంస్థలతో వెబినార్ నిర్వహించిన జల్ జీవన్ మిషన్ అందరి సహకారంతో మెరుగైన జీవన విధానం

హైదరాబాద్ , మే 15: లక్ష్యాల మేరకు జల్ జీవన్ మిషన్ ను అమలు చేయడానికి అనుసరించవలసిన వ్యూహంపై భాగస్వామ్య సంస్థలతో జల్ శక్తి మంత్రిత్వ శాఖకి చెందిన నీరు, పారిశుద్ధ్య శాఖ వెబినార్ ను నిర్వహించింది. జల్ జీవన్ మిషన్ తో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో కలసి పనిచేయడానికి శాఖ 175 సంస్థలను ఎంపిక చేసింది. 2024 వరకు జాతీయ, రాష్ట్ర జిల్లా స్థాయిల్లో లక్ష్యాల సాధనకు అమలు చేయవలసిన కార్యక్రమాలను ఈ సంస్థలు వార్షిక, త్రైమాసిక ప్రణాళికలను రూపొందిస్తాయి. ఈ అంశాలను చర్చించడానికి నిర్వహించిన వెబినారులో జల్ జీవన్ మిషన్ అదనపు డైరెక్టర్, జల్ జీవన్ మిషన్ మిషన్ డైరెక్టర్ పథకం లక్ష్యాలను వివరించారు. క్షీణిస్తున్న నీటి వనరులు, నీటి నాణ్యత-సమస్యలు, గ్రామంలో మౌలిక సదుపాయాలు, నిర్వహణ , వనరుల సామర్థ్యం లేకపోవడం, వివిధ రంగాలకు సరిపడా నీరు అందించడం లాంటి అంశాలపై భాగస్వామ్య సంస్థలు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి ప్రణాళికలను రూపొందించాలని మిషన్ డైరెక్టర్ సూచించారు.

కార్యక్రమ అమలు , ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ (ఐఇసి) వ్యూహాలు, సామాజిక సమీకరణ, సామర్థ్యాన్ని పెంపొందించడం , శిక్షణా కార్యక్రమాల నిర్వహణలో జాతీయ మిషన్ / రాష్ట్రాలతో కలిసి పనిచేయడం ద్వారా భాగస్వామ్య సంస్థలు జెజెఎం అమలులో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. విజయవంతమైన నమూనాలను గుర్తించి అమలు చేయడం , ఉత్తమ పద్ధతులను ప్రామాణికరించడం , సామాజిక తనిఖీలు నిర్వహించడం , వర్క్‌షాప్‌లు, సమావేశాలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలకు భాగస్వామ్య సంస్థలు ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది. శిక్షణ పొందిన భాగస్వామ్య సంస్థలు గ్రామ / నివాస స్థాయిలో ఈ రంగంలో మాస్టర్ ట్రైనర్‌లుగా పనిచేసి ప్రజలకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది.

2024 నాటికి దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి కొళాయి ద్వారా మంచి నీరు సరఫరా చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న జల్ జీవన్ మిషన్ నుప్రధానమంత్రి 2019 ఆగస్టు 15వ తేదీన ప్రారంభించారు.

రాష్ట్రాలతో కలసి జల్ జీవన్ మిషన్ తన కార్యక్రమాలను అమలు చేస్తోంది. జల్ జీవన్ మిషన్ ప్రారంభం అయ్యే నాటికి దేశంలో 3.23 కోట్ల గ్రామీణ కుటుంబాలు (17%) కొళాయి కనెక్షన్ కలిగి ఉన్నాయి. పథకం ప్రారంభం అయిన తరువాత కోవిడ్-19 సమస్య ఎదురైనప్పటికీ ఇంతవరకు జల్ జీవన్ మిషన్ కింద 4.17 కోట్ల కొళాయి కనెక్షన్లను అందిచడం జరిగింది. దీనితో ప్రస్తుతం దేశం 7.41 కోట్ల ( 38.6%)కుటుంబాలు రక్షిత మంచి నీటి సరఫరా సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి.

ప్రధానమంత్రి ఆశయం మేరకు 'సబ్కాసాత్, సబ్కా వికాస్' నినాదాన్ని ఆచరణ లోకి తీసుకొని రావడానికి 61 జిల్లాలు, 732 బ్లాకులు, 89,248 గ్రామాల్లో ప్రతి కుటుంబానికి రక్షిత మంచి నీరు అందించడానికి జల్ జీవన్ మిషన్ ను మరింత పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దీనికోసం జల వనరుల రంగంలో అనుభవం, అర్హతలు కలిగిన స్వచ్ఛంధ సంస్థలు, ట్రస్టులు, యుఎన్ సంస్థల షహాయ సహకారాలను తీసుకోవాలని నిర్ణయించింది. తమతో కలసి పనిచేయాలని కోరుతూ మిషన్ ప్రకటన జారీచేసింది. దీనికి స్పందనగా 330 దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించిన జల్ జీవన్ మిషన్ 175 సంస్థలను ఎంపిక చేసింది. భాగస్వామ్య సంస్థల సహాయ సహకారాలతో జల వనరుల నిర్వహణలో స్థానిక ప్రజలను భాగస్వాములను, కల్పించిన సౌకర్యాలను ఎక్కువ కాలం, సమర్థంగా వినియోగించడం,నీటి నాణ్యత అంశాలలో భాగస్వామ్య సంస్థల సహకారంతో జల్ జీవన్ మిషన్ పనిచేస్తుంది.

# కోవిడ్ కట్టడిలో సామాజిక నిర్వహణా అవసరమే!

హైదరాబాద్ , మే 15: జమ్ము కాశ్మీర్ లోని ఉధంపూర్-కథువా-దోడా లోక్ నియోజకవర్గం పరిధిలోని ఆరు జిల్లాలకు చెందిన ప్రజాసేవా నేతలు, కార్యకర్తలతో కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు కోవిడ్ నియంత్రణపై అంశాలపై ముచ్చటించారు. కోవిడ్ కట్టడికి సంబంధించిన పలు అంశాలపై విపులంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, కోవిడ్ నియంత్రణకు వైద్యపరమైన చికిత్స, పరిపాలనాపరమైన చర్యలకు సమానమైన స్థాయిలో సామాజిక నిర్వహణా చర్యలు కూడా అవసరమని అన్నారు. కోవిడ్ మహమ్మారిపై పోరాటంలో "భయాందోళన చెందడం కంటే ముందు జాగ్రత్తే కీలకమని" ఆయన అభిప్రాయపడ్డారు. కోవిడ్ చికిత్సలో వినియోగించే అత్యంత ఆవశ్యకమైన మందులు, ఆక్సిజన్ వంటి వాటిని అనవసరంగా దొంగచాటుగా నిల్వచేయడం అంటే,.. మానవాళిపై నేరానికి పాల్పడటమేనని, ఈ అంశాలపై ప్రజా సంఘాల నాయకులు అవగాహన, చైతన్యం కల్పించాలని కేంద్రమంత్రి సూచించారు.

కథువా, ఉధంపూర్, దోడా, రాంబన్, కిష్త్వార్ జిల్లాల్లో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు కావడం సంతృప్తి కలిగిస్తోందని ఆయన అన్నారు. కథువా, ఉధంపూర్ జిల్లాల్లోని ప్లాంట్లు ఇప్పటికే పని చేయడం ప్రారంభించాయని, దోడాలోని ప్లాంటు వచ్చే వారం, రాంబన్, కిష్త్వార్ లలోని ప్లాంట్లు ఈ నెలాఖరుకు పని ప్రారంభిస్తాయన్న సమాచారం సంతృప్తి కలిగిస్తోందని అన్నారు. ఆక్సిజన్ సిలిండర్లు, కృత్రిమ శ్వాస పరికరాలు (వెంటిలేటర్లు) అవసరమైన రోగులకు సమాన ప్రాతిపదికన అందేలా చూసేందుకు వాటి లెక్కలను కచ్చితంగా తనిఖీ చేయాలని కేంద్ర మంత్రి మరోసారి స్పష్టం చేశారు.

వెంటిలేటర్లను పనిచేయించగలిగే సాంకేతిక సిబ్బంది కొరత ఉందంటూ సమావేశంలో ప్రజాసేవా కార్యకర్తల లేవనెత్తిన సమస్యపై జితేంద్ర సింగ్ సానుకూలంగా ప్రతిస్పందించారు. ఈ విషయమై తాను అధికారులను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ వస్తున్నానని, వెంటిలేటర్ల నిర్వహణలో సిబ్బందికి స్వల్ప వ్యవధి శిక్షణ చేపట్టాలని ఇప్పటికే సూచించానని చెప్పారు. కోవిడ్ వైరస్ మహమ్మారి వ్యాప్తి ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో సిబ్బంది కొరత సమస్యను అధిగమించేందుకు పదవీ విరమణ చేసిన డాక్టర్లను, వైద్య విద్యార్థులను నియమించుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు.

తన పార్లమెంటరీ నియజకవర్గంలోని ఆరు జిల్లాల్లోనూ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చాలా మంది ప్రజా కార్యకర్తలు, ప్రతినిధులు కేంద్రమంత్రిని కోరారు. వ్యాక్సినేషన్ కు తాను అగ్రప్రాధాన్యం ఇస్తున్నానని, ఇందుకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. కాగా, వ్యాక్సీన్ వేయించుకోవలసిన ఆవశ్యతను గురించి ప్రజాసంఘాల భాగస్వామ్యంతో జిల్లా పరిపాలనా యంత్రాగం అవగాహనా కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు.

కోవిడ్ వ్యాప్తి కట్టడి కార్యకలాపాలకోసం తన ఎం.పి. నిధినుంచి రెండున్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసిన అంశంపై ప్రజా ప్రతినిధులనుంచి అభిప్రాయాలు తెలుసుకోవాలని ఆయన కోరారు. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి కారణంగా ఇదివరకు ఎన్నడూ కనీవినీ ఎరుగని సంక్షోభం ఉత్పన్నమైనందున తానీ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. కోవిడ్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమకు అందుబాటులో ఉన్న వనరులద్వారా శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు, ఆక్సీమీటర్లు, మాస్కులు, శానిటైజర్లు, పి.పి.ఇ. కిట్లు, ఆక్సిజన్ సిలిండర్లు, కోవిడ్ నియంత్రణకు సంబంధించిన ఇతరత్రా సామగ్రి కొనుగోలుకు ఈ నిధిని వినియోగించవచ్చని అన్నారు.కోవిడ్ కట్టడిలో ఉపయోగపడే ఫేస్ మాస్కులు, శానిటైజర్లు, యాంటి సెప్టిక్ మందులు, వ్యాధి నిరోధక శక్తి బూస్టర్లు, టాయిలెట్ సామగ్రితో వంటి వాటితో కూడిన ఒక ట్రక్కును ఈ వారమే తన నియోజక వర్గానికి అందుబాటులో ఉండేలా జితేంద్ర సింగ్ చర్యలు తీసుకున్న సంగతి ఇక్కడ గమనార్హం. ఇలాంటి సామగ్రి తమకు కావాలంటూ, తన పార్లమెంటరీ నియోజ కవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి అందుతున్న డిమాండ్లపై కేంద్రమంత్రి స్పందిస్తూ, భవిష్యత్తులో కూడా కోవిడ్ సంబంధమైన సామగ్రిని క్రమం తప్పకుండా సరఫరా చేయనున్నట్టు తెలిపారు. సహాయ సామగ్రితో కూడిన రెండవ విడత ట్రక్కును వచ్చే వారం పంపించనున్నట్టు చెప్పారు. లాక్ డౌన్ ఆంక్షల కారణంగా కొన్ని సరకుల సేకరణలో కొన్ని సమస్యలు ఎదురువుతున్నట్టు ఆయన చెప్పారు. ఎక్కడో సుదూరంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలకోసం తమ సొంత వనరులను వినియోగించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తల కృషి ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. లాక్ డౌన్ కారణంగా ఉపాధి, ఆదాయం కోల్పోయి, బాధల్లో ఉన్న వారికి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నట్టు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.

# ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మెరుగైన సేవలందించాలి



జనగామ, మే 15 : ప్రభుత్వ హాస్పిటల్స్‌లో కొవిడ్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలందించి, ప్రజల్లో నమ్మకం కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులతో కొవిడ్ నియంత్రణ చర్యలు, యాసంగి ధాన్యం కొనుగోళ్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొవిడ్ పాజిటివ్ రేట్ 20 శాతం ఉందన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కొవిడ్ మహమ్మారి నియంత్రణకై పనిచేయాలన్నారు.ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నట్లు, కొవిడ్ లక్షణాలు ఉన్న 5 వేల 510 మందికి ఇంటి వద్దనే మందులతో కూడిన హెల్త్ కిట్లు అందజేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించడానికి 7 అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

జిల్లాలో పడకలు, ఆక్సిజన్, రెమిడిసిర్ ఇంజక్షన్ల కొరత లేదని మంత్రి తెలిపారు. ఆక్సిజన్ బెడ్లను పెంచడానికి వెంటనే చర్యలు చేపట్టామన్నారు. పరిశుభ్రత చాలా ముఖ్యమని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని ఆదేశించారు. బాలవికాస, ఎమ్మెల్యేల, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని అన్నారు.

జిల్లా కేంద్రంలో 8247847692 నెంబర్‌తో కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా హెల్త్ కిట్లు అందజేసినవారికి నేరుగా ఫోన్ చేసి వారి ఆరోగ్య సమాచారం, సేవల గురించి తెలుసుకొని అవసరమైన పక్షంలో ఇంకా మెరుగైన సేవల వైద్యుల దృష్టికి తీసుకెళ్లొచ్చాన్నారు.

సమావేశంలో కలెక్టర్ కె. నిఖిల, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, జనగామ, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, తాటికొండ రాజయ్య, అదనపు కలెక్టర్లు ఏ. భాస్కర్ రావు, అబ్దుల్ హమీద్, మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమున, ఏసీపీ వినోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. ఏ. మహేందర్త దితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ద్వితీయ పరీక్షలు రద్దు యోచనలో విద్యా శాఖ



హైదరాబాద్ , మే 15: రాష్ట్రంలో కరోనా తీవ్రత ఇంకా కొనసాగుతునే ఉంది. ప్రతి రోజు 4వేల నుంచి 5వేల మధ్య లో కొత్తగా కరోనా పాజిటివ్ కేసులు రాష్ట్రం లో నమోదవుతునే ఉన్నాయి. మరో వైపు రాష్ట్రంలో ఈనెల 21 వరకు లాక్‌డౌన్ అమలు లో ఉంది. కరోనా కేసులు తగ్గు ముఖం పట్టి సాధారణ పరిస్థితులు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి రాష్ట్రంలో నెల కొంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వాయిదా పడ్డ ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు మళ్లీ జరగడం సాధ్యమయ్యే పనిలా కనిపించడంలేదని విద్యా వర్గాలు పేర్కొంటున్నాయి. రద్దు అయ్యే అవ కాశాలే ఎక్కువగా కనబడుతున్నాయని పేర్కొంటు న్నారు. అధికారులూ సైతం ఈ విషయంలో ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ విషయంలో విద్యాశాఖ ముందు నుంచి సీబీఎస్ఈ విధానాలనే అనుసరిస్తూ వస్తోంది. ఇప్పుడు కూడా 12వ తరగతి పరీక్షల నిర్వహణపై సీబీఎస్ఈ ఏ నిర్ణయం తీసుకోనుందో అదే నిర్ణయా న్ని ఇంటర్ బోర్డు సైతం అమలు చేయాలని భావి స్తోంది. కరోనా కేసులు పెరుగుతుండటంతో దేశవ్యా ప్తంగా పదో తరగతి, 11వ తరగతి పరీక్షలను సీబీఎస్ఈ రద్దు చేసి, 12వ తరగతి పరీక్షలను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అలాగే 12వ తరగతి పరీక్షల నిర్వహణపై జూన్ మొదటి వారంలో సమీక్షించి దానిపై ఒక నిర్ణయం తీసుకుం టామని ప్రకటించింది. సరిగ్గా ఇలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా పదో తరగతి పరీక్షలను రద్దు చేసి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ వాళ్లను ప్రమోట్ చేస్తూ, సెకండ్ ఇయర్ పరీక్షలు వాయిదా వేసింది. జూన్ మొదటి వారంలో సమీక్ష నిర్వహించి పరీక్షలపై ఓ నిర్ణయం ప్రకటిస్తామని తెలిపింది. అయితే దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాలు లాక్‌డౌన్‌లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలనూ రద్దు చేసే యోచనలో కేంద్రం ఉన్నట్లు సమాచారం. తెలంగాణ సర్కార్ కూడా సీబీఎస్ఈ విధానాన్నే అనుసరించి సెకండ్ ఇయర్ పరీక్షలను రద్దు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణలో పరిస్థితులు ఇంకా ఇలానే ఉంటే లాక్‌డౌన్‌ను ఇంకా కొన్ని రోజులు పొడిగించే అవకాశం కూడా లేకపో లేదు. మరీ ఇలాంటి క్రమంలో రాష్ట్రంలో విద్యా ర్థులకు పరీక్షలు నిర్వహించడం సాధ్యమయ్యే పనికాదని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే జూన్ మొదటి వారంలో పరీక్షల రద్దు విషయంలో ప్రభు త్వం ఓ నిర్ణయం తీసుకోను న్నట్లు తెలుస్తోంది. ఒకవేళ పరీక్షలను నిర్వహించడం తప్పనిసరైతే ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు రాయడం లాంటి ప్రత్యామ్నాయ పద్ధతు లను వెతికే పనిలో అధికారులు పడినట్లు సమా చారం. మే 1వ తేదీ నుంచి 30 వరకు జరగాల్సిన ఇంటర్ ఎగ్జామ్స్ కరోనా నేపథ్యంలో వాయిదా పడిన విషయం తెలిసిందే.

## సింగరేణిలో కొవిడ్ నియంత్రణకు పటిష్ట చర్యలు



హైదరాబాద్ , మే 15: సింగరేణిలో కొవిడ్ మహమ్మారి కట్టడికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కు అనేక చర్యలు చేపడుతున్నారు.

కొవిడ్ నిర్ధారణ పరీక్షలు మొదలు వైద్య సేవలు, క్వారంటైన్ సెంటర్‌ల ఏర్పాటు, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటు, వ్యాక్సినేషన్ ప్రక్రియ వరకు అన్ని దశల్లో కరోనా కట్టడికి కృషి టీబీజీకేఎస్ చేస్తున్నది. సింగరేణి సీఎండీ శ్రీధర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ, మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.3.16 కోట్లతో లక్షా పదివేల రాపిడ్ టెస్ట్ కిట్ల కొనుగోలు. భారీ ఎత్తున పరీక్షలు, 25 వేల మందికి వ్యాక్సినేషన్, 1,400 బెడ్ లతో ప్రత్యేక వార్డుల ఏర్పాటు.

సింగరేణి వ్యాప్తంగా ఉన్న కరోనా ప్రత్యేక వార్డుల్లోనూ, ఐసోలేషన్ సెంటర్లలో అందిస్తున్న వైద్య సేవలతో 9,650 మంది పూర్తిగా కోలుకున్నారు.

సింగరేణిలో మొత్తం కార్మికుల సంఖ్య 44వేలు కాగా ప్రస్తుతం యాక్టివ్ కేసులుగా ఉండి వైద్యం పొందుతున్న కార్మికుల సంఖ్య కేవలం 560 మాత్రమే.

ప్రభుత్వ సహకారంతో సింగరేణి వ్యాప్తంగా ఇప్పటికే 27 వేల మందికి వాక్సినేషన్ కూడా పూర్తి చేసింది. మరో 50 వేల మందికి వాక్సినేషన్ చేయించడం కోసం వాటిని తయారీదారుల నుంచే కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

కరోనా తీవ్రంగా ఉన్న వారిలో ఇప్పటి వరకు 862 మందికి హైదరాబాద్‌లోని కార్పొరేట్ దవాఖానల్లో వైద్య సేవలకు గాను, సింగరేణి యాజమాన్యం సుమారు 38 కోట్ల రూపాయలను వెచ్చించింది.

సింగరేణి వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 673 బెడ్ లకు అదనంగా, రూ.43 లక్షలతో మరో 755 బెడ్ లను ఏర్పాటు చేశారు.

సుమారు 80 లక్షల రూపాయలతో వివిధ రకాల మందులు, ఆక్సిజన్ మీటర్ వంటి 18 రకాల వస్తువులు గల కిట్లను కొనుగోలు చేసి హోం ఐసోలేషన్ లో ఉన్నవారికి అందజేశారు.

సింగరేణి వ్యాప్తంగా ఉన్న దవాఖానలకు అవసరమైన రెమిడిసివిర్ ఇంజెక్షన్లు, ఫెవి పెరావిర్ వంటి మందులను 5.55 కోట్లలతో సమకూర్చారు.

ఆక్సిజన్ కొరత లేకుండా చూసేందుకు, 3.60 కోట్ల రూపాయల వ్యయంతో ఐదు చోట్ల ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలు, 1.18 కోట్ల రూపాయలతో 370 ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేశారు.

కొవిడ్ వార్డులకు అవసరమైన 20 మంది అదనపు డాక్టర్లను, 250 మంది సిబ్బందిని కూడా కాంట్రాక్టు పద్ధతిన నియమించారు.

కొవిడ్ పేషెంట్లకు సింగరేణి సంస్థ పౌష్టిక ఆహారం అందిస్తోంది. దీని కోసం 1.50 కోట్ల రూపాయలను ఇప్పటి వరకు వెచ్చించింది. వీటితోపాటు శానిటేషన్ లిక్విడ్, మాస్కులు,హ్యాండ్ శానిటైజర్లు వైద్యులకు కావలసిన పీపీ ఇ కిట్లు, మాస్కులు వంటివి అందజేసింది.

కొవిడ్ వ్యాధి కారణంగా మృతి చెందిన ఉద్యోగులు 39 మంది ఒక్కొక్కరికి 15 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను కూడా కంపెనీ చెల్లించింది.

## కరోనా బాధితులకు ఉచితంగా ఇంటి వద్దకే భోజనం..!

-కలెక్టరేట్లో ఆహార సహాయ కేంద్రం ప్రారంభం.

- జిల్లా కలెక్టర్ హనుమంత రావు.



సంగారెడ్డి, మే 15 ( నేటినిజం ప్రతినిధి) కరోనా బాధితుల కోసం కలెక్టరేట్లో ఆహార సహాయ కేంద్రం ప్రారంభం సహాయ కేంద్రంమొబైల్ నెంబర్7207488745 కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలి . సంగారెడ్డి మున్సిపాలిటీ లో హోమ్ ఐసోలేషన్ లో ఉన్న బాధితులువినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు.

కరోనా బారిన పడిన బాధితులు ఎవరూ కూడా భోజనానికి ఇబ్బంది పడవద్దని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కోవిడ్ బారినపడి హోమ్ ఐసోలేషన్ లో ఉన్న వారికి ఇంటి వద్దకే భోజనం పాకెట్లు పంపనున్నట్లు ఆయన తెలిపారు. వెంటనే అందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాల్సిందిగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, కలెక్టరేట్ సూపరిండెంట్ లకు ఆదేశించారు.

శనివారం నాడు కరోనా బాధిత హోమ్ ఐసోలేషన్ లో ఉన్న కుటుంబాలకు ఆహారం అందించడం పై సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా విజృంభణతో పలు కుటుంబాలు కరోనా బారిన పడి హోమ్ ఇసోలేషన్ లో ఉన్నా వంట చేసుకునే స్థితిలో లేరని, ఇంటిల్లిపాది కోవిడ్ తో బాధపడుతున్న వారు, తల్లిదండ్రులిద్దరూ కోవిడ్ బారినపడటంతో వంట చేసుకోలేని పిల్లలు ఉన్నారని, అలాంటి వారికోసం ఒక్కపూటైనా మంచి పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టరేట్ లో ఆహార సహాయ కేంద్రం ప్రారంభించామని తెలిపారు.

ఆహార సహాయ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవడానికి సూపరిండెంట్ స్థాయి అధికారులు ఇద్దరు నియమించామని తెలిపారు. అక్షయపాత్ర వారి సహకారంతో ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సుమారు 450-500 గ్రాముల పౌష్టికాహారంతో వండిన కిచిడీ ప్యాకెట్లను కోవిడ్ బాధితులకు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

బాధితుల ఇండ్లకు భోజనాన్ని చేరవేయడానికి 4 ఎలక్ట్రికల్ ఆటో వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. నమోదైన ఇంటి వివరాల మేరకు మునిసిపల్ సిబ్బంది రూట్ మ్యాప్ చేస్తారని, ఆమేరకు బాధితులకు సకాలంలో భోజనం అందిస్తారన్నారు. భోజనం పంపిణీ పూర్తి బాధ్యతలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి చూసుకుంటారన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేర్లు నమోదు చేసుకున్న బాధితులకు సవ్యంగా భోజనం అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బీసీ సంక్షేమ అధికారి కేషరాంకు సూచించారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కరోనా బారినపడి హోం ఐసోలేషన్ లో ఉండి వంట చేసుకో లేక భోజనానికి ఇబ్బంది పడుతున్న వారు ఆహార సహాయ కేంద్రం మొబైల్ నెంబర్. 7207488745 కు ఫోన్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. రేపటి నుండి (ఆదివారం) మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు ఫోన్ చేసి తమ పేరు, మొబైల్ నెంబర్, ఇంటి నెంబర్, ఏరియా/లోకేషన్ తదితర వివరాలను తెలపాలన్నారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వారింటికి భోజనం ప్యాకెట్లు పంపిస్తారని ఆయన వివరించారు.

భోజనం కొరకు పేర్లు నమోదు చేసుకున్న కరోనా బాధితులు మందులు అయిపోయినట్లైతే కావాలని కోరితే, భోజనంతోపాటు మందులను తీసుకెళ్లి అందజేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇట్టి అవకాశాన్ని సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఐసోలేషన్ లో ఉన్న కోవిడ్ బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశోరాం, కలెక్టరేట్ సూపరిండెంట్ లు శ్రీమాన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా కోరల్లో కారాగారవాసులు...!

దేశవ్యాప్తంగా 1,350 జైళ్లు ఉండగా, అందులో 617 సబ్-జైళ్లు, 410 జిల్లా జైళ్లు, 144 సెంట్రల్ జైళ్లు, 86 ఓపెన్ జైళ్లు, 41 ప్రత్యేక జైళ్లు, 31 మహిళా జైళ్లు, 19 బోర్స్టల్ స్కూల్స్ మరియు 2 ఇతర జైళ్లు ఉన్నాయి. ఈ జైళ్లలలో 4,66,084 ఖైదీలు, వీరిలో 19,913 మహిళా ఖైదీలు ఉన్నారు. కారాగారాలు తీవ్ర రద్దీతో కిటకిటలాడుతున్నాయి. మన జైళ్లు 117.6 శాతం అక్యుపెన్సీ రేటుతో అతి రద్దీతో ఉన్నాయి. యూపీ జైళ్లలో 176.5 శాతం మరియు సిక్కిమ్ జైళ్లలో 157.3 శాతం అక్యుపెన్సీ రేటుతో నిండి ఉన్నాయి. మన దేశ జైళ్లలో సగటున 17 శాతం ఖైదీల రద్దీ అధికంగా ఉందని కూడా తేలింది. జైళ్లలో రద్దీ అతిగా పెరిగితే మానవ హక్కులకు సహజంగానే భంగం కలుగుతుంది. జైళ్లలో దోషులు, నిందితులు మరియు నిర్బంధించబడిన వారు ఉంటారని మనకు తెలుసు. సామర్థ్యం కన్న అధికంగా, అతి సమీపంగా, మూసి ఉన్న గదుల్లో ఉండడం, ప్రతి రోజు కొత్త ఖైదీలు బయట నుంచి రావడం లాంటి కారణాలతో కరోనా మహమ్మారి సులభంగా అందరు ఖైదీలకు సోకే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న 3 జైళ్లలో తీహార్ మహిళా జైలులో అత్యధికంగా 42 మహిళా ఖైదీలకు కరోనా సోకిందని అధికారికంగా తెలుస్తున్నది. తీహార్ పురుష జైలులో 33 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఢిల్లీలోని మండోలి మరియు రోహిణి జైళ్లలో కూడా అధిక కరోనా కేసులు నిర్ధారణ అయ్యాయని తెలుస్తున్నది. ఢిల్లీలోని 3 జైళ్లలో కలిపుకొని మార్చి 2021 వివరాల ప్రకారం 267 ఖైదీలకు మరియు 92 మంది జైళ్ల సిబ్బందికి కరోనా సోకిందని వెల్లడించారు. హర్యానాలోని కర్నాల్ జిల్లా జైలులో ఇప్పటి వరకు 354 కొత్త కరోనా కేసులు మరియు 577 రికవరీలు జరిగాయని ప్రకటించారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో హెచ్‌ఐవి-ఏయిడ్స్, కిడ్నీ, హెపటైటిస్, ఉబ్బసం మరియు టిబి లాంటి రోగాలున్న ఖైదీలను పేరోల్ పై విడుదల చేయబడినారు. తీహార్ జైలు నుంచి పేరోల్‌పై విడుదలైన 6,740 మంది ఖైదీల్లో కరోనా భయంతో 3,468 మంది తిరిగి రిపోర్ట్ చేయలేదని తెలుస్తున్నది.

జైళ్లలో బంధీలకు మరియు సిబ్బందికి కరోనా సోకకుండా తగు చర్యలు తీసుకోవలసినదిగా సర్వోన్నత న్యాయస్థానం సుప్రీమ్ కోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఎవరి జీవించే హక్కులు హరించరాదని, ఆరోగ్యాలకు ముప్పు కలిగించరాదని పేర్కొంటూ మహమ్మారి కట్టడికి జైళ్లలో రద్దీని తగ్గించుటకు మార్గాలను వెతకాలని సూచనలు చేసింది. అన్ని రాష్ట్రాలలో 'హైపవర్డ్ కమిటీ'లు ఖైదీలను విచారించి, తీవ్ర ఆరోపణలు లేని వారికి మధ్యంతర బెయిల్ ఇస్తూ విడుదల చేయాలని తీర్పు ఇవ్వడంతో రద్దీ తగ్గిపోయి, కరోనా వ్యాప్తి అరికట్టబడుతుందని భావిస్తున్నారు. గతంలో మధ్యంతర బెయిల్ పొంది విడుదలైన వారికి వెంటనే మరోసారి బెయిల్ పొడిగించాలని తెలిపింది. లాక్‌డౌన్ కాలంలో బెయిల్‌పై విడుదలైన వారిని స్వస్థలాలకు సురక్షితంగా చేర్చాలని కూడా కోర్టు సూచనలు చేసింది. జైళ్లలో తరుచుగా కరోనా పరీక్షలు నిర్వహించాలని, పాజిటివ్ అని తేలిన వారికి సత్వరమే వైద్య చికిత్సలు అందించాలని పేర్కొంది. 2020లో 'పెరోల్'పై 90 రోజుల కాలవ్యవధితో విడుదలైన ఖైదీలకు మరో పెరోల్ అవకాశం ఇవ్వనున్నారు. జైళ్లలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం మరియు వైద్యారోగ్య వసతులు పరిమితంగా ఉన్నందున కరోనా సులభంగా వ్యాపించడం జరుగుతున్నదని తెలిపింది. కరోనా రెండవ అల వల్ల దాదాపు అన్ని జైళ్లలో కరోనా కేసులు నమోదు అవుతుండటం విచారకరం. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న ఖైదీలను మధ్యంతర బెయుల్‌పై విడుదల చేసినపుడు శాంతి భద్రతల సంక్షోభం కూడా ఏర్పడవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కరోనా కబళించకుండా ఖైదీలను మానవీయ కోణంలో రక్షణ చర్యలు చేపట్టాలని, కారాగారాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం మరియు వైద్య వసతులు కల్పించాలని దేశ పౌరులు కోరుకుంటున్నారు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్‌లో వ్యాక్సిన్ స్లాట్ బుక్ చేసుకోవచ్చు!

హైదరాబాద్ , మే 15: దేశంలో కరోనా సంక్షోభం తీవ్రస్థాయిలో ఉంది. మహమ్మారిపై భారత్ పోరాటంలో సహాయం చేయడానికి చాలా కంపెనీలు ముందుకు వస్తున్నాయి. తాజాగా టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ కరోనా విపత్కర పరిస్థితుల్లో తన వినియోగదారులకు అత్యవసర సేవలందించేందుకుముందుకొచ్చింది. కొవిడ్ అత్యవసర సేవలను యూజర్లకు ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్ ద్వారా అందించడాన్ని ప్రారంభించింది.వినియోగదారులకు కొవిడ్ ఎస్‌ఓఎస్ రిసోర్స్‌తో ఔషధాలు, ఆక్సిజన్, ప్లాస్మా దాతలు, అంబులెన్స్, హాస్పిటల్‌లో బెడ్లు, టెస్టింగ్ కేంద్రాల వంటి ముఖ్యమైన సమాచారంతో పాటు వ్యాక్సినేషన్ స్లాట్‌లను బుకింగ్ చేసుకునే అవకాశాన్ని యాప్ ద్వారా అందిస్తోంది. థాంక్స్ యాప్‌లోని ఎక్స్‌ప్లోర్ సెక్షన్‌లో కొవిడ్ సపోర్ట్, సంబంధిత సమాచారాన్ని సులభంగా యాక్సెస్ చేసుకునేలా సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసింది. యూజర్లు తమతో పాటు సన్నిహితులకు టీకా స్లాట్‌ను యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

# లాక్ డౌన్ పకడ్బందీగా అమలు -జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

## నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తాం



రాజన్న సిరిసిల్ల మే, 15(నేటినిజం ప్రతినిధి): జిల్లాల్లో లాక్డౌన్ పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు.జిల్లాలో అమలవుతున్న నాలుగోవ రోజు లాక్ డౌన్ సందర్భంగా జిల్లా లోని సిరిసిల్ల వేములవాడ పట్టణాలను జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే శనివారం రోజున పరిశీలించారు..నిబంధనలు అతిక్రమించి రోడ్లపై తిరుగుతున్న పలు వాహనాలు అపి ఎక్కడకి, ఏ పనిపై వెళున్నారు? వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూప్రజాశ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని వైరస్ ఉధృతిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు స్వీయ రక్షణ కంటే మించింది మరోటి లేదని గ్రహించి కొవిడ్? మహమ్మారిభారినపడకుండా మాస్క్?లు, బౌతికదూరం పాటించాలని సూచించారు.లాక్ డౌన్ సమయంలో ఏలాంటి కారణాలు లేకుండా వస్తున్న ప్రజలకు అవగాహన కల్పిస్తూనే..ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ జిల్లా పరిధిలో చాలా కఠినంగా అమలు అవుతుందన్నారు. ప్రజలు అన్ని వర్గాల వారు ఈ లాక్ డౌన్ అమలు ప్రక్రియకి చాలా బాగా సహకరిస్తున్నారు. ఎవరైతే సహకరించకుండా బయట తిరుగుతున్నారో వారిపై డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆక్ట్ ప్రకారం, లాక్ డౌన్ నిబంధనలు ఉల్లంఘన గైడ్లైన్స్ ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని అన్నారు.జిల్లాపరిధిలోని నిన్న 220 మంది పై కేసు నమోదు మరియు10షాప్ ల పైన కూడా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారులాక్ డౌన్ నిబంధనలు పాటించ కుండా ముఖ్యంగా లాక్ డౌన్ సమయాల్లో అనవసరంగా రోడ్లమీదకు రావద్దని ఎవరైతే నిబంధనలను అతిక్రమిస్తారో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.జిల్లా ఎస్పీ వెంట సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ ,సి.ఐ లుఅనిల్ కుమార్ ,వెంకటేష్ ,ట్రైని ఎస్.ఐ సంధ్య మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులపైనే థర్డ్ వేవ్ ముప్పు?

హైదరాబాద్ , మే 15: కరోనా సెకండ్ వేవ్ ఆందోళనకర రీతిలో వ్యాపిస్తున్న నేపథ్యంలో మరికొన్ని రోజుల్లో థర్డ్ వేవ్ ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే థర్డ్ వేవ్ అత్యధికంగా పిల్లలపై ప్రభావం చూపే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు చర్యలను ప్రారం భించింది. మొదటి వేవ్‌లో వృద్ధులపై ప్రతా పాన్ని చూపించిన వైరస్, సెకండ్‌వేవ్‌లో యువత, మధ్య వయస్కులపై విరుచుకుపడు తోంది. ఇక థర్డ్ వేవ్‌లో చిన్నారులపై వైరస్ దాడి ఊహకందని విధంగా ఉంటుందని ప్రపం చవ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణులు హెచ్చ రిస్తున్నారు. ముంబైతోపాటు ఇతర పట్టణా ల్లోని ఆసుపత్రుల్లోని చిన్న పిల్లల కోసం పీడియాట్రిక్ కోవిడ్ కేర్ వార్డులను ఏర్పాటు చేస్తోంది. కరోనా మొదటి వేవ్, సెకండ్‌వేవ్‌లు పిల్లలపై తక్కువగానే ప్రభావం చూపుతున్నా? వైరస్ బారిన పడుతున్న చిన్నారుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

కరోనా మొదటి వేవ్‌లో 1శాతం కంటే తక్కువ మంది పిల్లలకు కరోనా సోకగా? సెకండ్‌వేవ్‌లో పిల్లలకు వైరస్ సంక్రమణ రేటు 10శాతానికి పెరిగింది. పరిస్థితులను బట్టి చూస్తే థర్డ్ వేవ్‌లో చిన్నారులకు వైరస్ సోకే ప్రమాదం 80శాతం ప్రమాదం పొంచి ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా సోకకుండా మాస్కు, భౌతికదూరం, శానిటైజర్లు వాడడం వంటి జాగ్రత్తలను పాటిం చాలన్న మానసిక పరిపక్వత పిల్లల్లో ఉండ దని, ఫలితంగా వారిపై థర్డ్ వేవ్ విరుచుకువడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. మన రాష్ట్రంలో చిన్నారుల సంఖ్య దాదాపు కోటి వరకు ఉంది. అక్టోబరు నుంచి డిసెంబరు వర కు కరోన థర్డ్ వేవ్ ప్రమాదం పొంచి ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది మే చివరి నాటికి, జూన్ రెండో వారం నాటికి సెకండ్ వేవ్ తగ్గుముఖం పడుతుందని, అయితే జూన్‌లో పాఠశాలలు తిరిగి ప్రారంభిస్తే థర్డ్ వేవ్ చిన్నారులపై విరుచుకుపడే ప్రమా దముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో పాఠశాలలు ప్రారంభించెక? ముందే ప్రభుత్వాలు చిన్నారులకు వైరస్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైరాలజీ నిపుణులు సూచిస్తున్నారు. తరచూ పాఠశాలలను శానిటైజ్ చేయడం, మధ్యాహ్న భోజనంలో పిల్లలకు పౌష్టికాహార స్థాయిలను మరింత పెంచడం, క్లాసు రూముల్లో సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాంటున్నారు.

మరోవైపు చిన్నారులకు కూడా వ్యాక్సిన్ ఇస్తేనే థర్డ్ వేవ్ నుంచి వారిని కాపాడుకోగ లుగుతామని చిన్న పిల్లల నిపుణులు స్పష్టం చేస్తున్నారు. థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు చాలా దేశాలు ఇప్పటికే చిన్నారులకు కూడా వ్యాక్సిన్ ఇవ్వాలని నిర్ణయించాయి. దీంతో చిన్నారులకు కరోనా వ్యాక్సిన్ ఇచ్చే అంశంపై పలు టీకా ఉత్పత్తి సంస్థలు క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించాయి. ఇప్పటికే మనదేశంలోని భారత్ బయోటెక్ చిన్నారులపై వ్యాక్సిన్ ట్రయల్స్ నిర్వహించేందుకు అనుమతి పొందింది.

ఈ పరిస్థితుల్లో పిల్లలను మానసికంగా దృఢంగా ఉంచాలని తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్నారు. ఏడాదిన్నరగా స్కూళ్లు బంద్ కావడంతో నాలుగు గోడల మధ్యే పిల్లలు ఉంటున్నారు. దీంతో తల్లిదండ్రుల కొత్త ఆంక్ష లతో కుంగిపోతున్నారని, ఒత్తిడిని ఎదుర్కోలేక చిన్నారుల ప్రవర్తనలో చాలా మార్పులు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం థర్డ్ వేవ్ పొంచి ఉన్న నేపథ్యంలో ఓ రకంగా తల్లిదండ్రులకు ఈ పరిస్థితులు గడ్డు కాలమని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుఓల పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపాలని, ఇంట్లోనే ఆటలు ఆడించాలని సూచిస్తున్నారు. క్యారమ్స్, చెస్ తదితర ఆటలు ఆడించడంతోపాటు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచిస్తున్నారు.

# ఆర్థిక కష్టాల్లో తెలంగాణ సర్కార్

హైదరాబాద్ , మే 15: పెరిగిన ఖర్చులు, పూర్తిగా ఆగిన రాబడితో ఆర్థిక శాఖ కుస్తీ పడుతోంది. రానున్న ఖర్చులను అంచనా వేసుకుని అవసరాలను అంచనా వేసుకుంటోంది. ముందస్తు ఆలోచనలతో వేలుకున్నప్పటికీ కరోనా ప్రభావం నియంత్రణలోకి రానిపక్షంలో జూన్ నెలలో ఎలా నెట్టుకు రావా లనే కోణంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెలలో అన్ని రాబడులు పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఉంది. రాబడి శాఖలు పూర్తిగా లాక్‌డౌన్‌లో ఉండిపోయాయి. అప్పులు, బాండ్ల విక్ర య ఆదాయం మినహా ఖజానాకు రాబడి లేకుండా పోతోంది. ఈ నెలలో పూర్తిగా రాబడిపై ప్రభుత్వం ఆశలు వదులుకుంది. కరోనాతో పెరిగిన ఖర్చులకు దీటుగా ఎటువంటి ఆర్థిక వన రులు సర్కార్‌కు అందడంలేదు. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్దుబాటుపై ఆర్థిక శాఖ మల్లగుల్లాలు పడుతోంది. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా రావాల్సిన రూ. 5వేల కోట్లు ఉండగా ఈ నెలలో పెట్రో ఉత్పత్తులు నిల్చిపోయే ప్రమాదకర పరిస్థితితోపాటు ఇతర వినియోగ వస్తువుల కొనుగోళ్లు మందగించడంతో రాబడి 10శాతంలోపుగానే ఉంది. మద్యం ఆదాయం కొంతమేర ఆశాజనకంగా ఉండగా, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కార్యాలయాలు ఈనెల 22వరకు తెరచుకునే అవకాశాలు లేవు. ధరణిలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వ్యవసాయేతర క్రయవిక్రయాల లావాదేవీలు పూర్తిగా నిల్చిపో యాయి. ఈ శాఖద్వారా వచ్చే రూ. 900కోట్లు పూర్తిగా కరు వయ్యాయి. రవాణా శాఖ ద్వారా సమకూరే రూ. 350కోట్లలో ఒక్క రూపాయి కూడా వచ్చే అవకాశాలు కనిపించడంలేదు. కాగా ఈనెల వేతనాలు రూ. 3500కోట్లు, ఆసరా పించన్లు రూ. 1000కోట్లు, ఇతర నిర్వహణ వ్యయాలు, కరోనా కట్టడికి ప్రత్యేక వ్యయాలు, ఖర్చులు వంటివన్నీ కలుపుకుని దాదాపు రూ. 12వ???ల కోట్లు తక్షణం కావాల్సి ఉంది. గత వారం బాండ్ల విక్ర యాలతో రూ. 2వేలు కోట్లు సమకూర్చుకోగా, ప్రభుత్వ ఖజా నాలో మరో రూ. 900కోట్లు ఉండగా, ప్రభుత్వ శాఖలనుంచి రూ. 2వేల కోట్లు వారి ఖాతాలనుంచి వస్తాయనే ఆశతో ప్రభుత్వం ఉంది.

**ఈ నెలాఖరుకు రూ. 12వేల కోట్లు కావాల్సిందే?**

ఈ నెలాఖరుకు వేతనాలు, పించన్లకు రూ. 3500కోట్లు, వడ్డీల చెల్లింపులకు రూ. 1150 కోట్లు, రుణాల రీ పేమెంట్‌కు రూ. 1300 కోట్లు, ఆసరా పించన్లకు రూ. 1000 కోట్లు, స్థానిక సంస్థలకు ప్రతీనెలా ఇస్తామని చెప్పిన రూ. 500కోట్లు తక్షణం కావాల్సి ఉంది. ఇక ఉచిత బియ్యం కోసం రూ. 1120కోట్లు, ఇతర వైద్య ఖర్చులకు, వైద్య పరికరాలకు, ఉద్యోగుల ప్రోత్సాహకాలకు భారీ మొత్తం సమీకరించుకోవాల్సి ఉంది. పన్ను రాబడులు పూర్తిగా స్థంభించిపోవడం, కేంద్రం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందే అవకాశాలు మృగ్యం కావడంతో నిధుల సమీక రణకు దృష్టిసారించింది. మరోసారి బాండ్ల విక్ర యంతో రూ. 1000 కోట్లు, కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటా రూ. 1400కోట్లను సమీకరించేందుకు ఆర్థిక శాఖ చర్యలు ఆరంభించింది.

# నిరుపేదలకు అండగా తాను ఉన్నానని కష్టకాలంలో ముందుకువస్తున్న రామన్న

## -లాక్ డౌన్ లో మరోసారి మానవత్వంతో తమ ఔనత్యాన్ని చాటుకున్న టి. ఆర్. కె. ట్రస్ట్ -నిరుపేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



రాజన్న సిరిసిల్ల మే, 15(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వం లాక్ డౌన్ విధిస్తున్న సమయంలో నిరుపేదలకు సహాయం చేస్తూ కష్టకాలంలో మేమున్నామని మరోసారి చాటి చెబుతున్నారు ×తోట రామ్ కుమార్

కరోనా మహమ్మారి మరోసారి విజృంభించడంతో రాష్ట్ర ప్రజలు కోవిడ్ బారినపడి విలవిలలాడుతున్న సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లాక్ డౌన్ 10 రోజులు విధించింది. దీంతో వేములవాడ పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉండే బిక్షాటన చేసేవారు, వలస కార్మికులు, రోజువారి కూలీ చేసుకునేవారికి బతుకు భారం కావడంతో టి.ఆర్.కె ట్రస్ట్ సభ్యులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవ చేస్తూ పేదలకు ఆహార ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా టి.ఆర్.కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్×మాట్లాడుతూ కరోనా మహమ్మారి సెకండ్ వేవ్ తో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కరోనా ను కట్టడి చేయడానికి 10 రోజులు లాక్ డౌన్ విధించిందన్నారు. టి.ఆర్.కె చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2020 సంవత్సరం లాక్ డౌన్ సమయంలో చాలామంది రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలకు టి.ఆర్.కె ట్రస్ట్ తరఫున సహాయం అందించామని,అదేవిధంగా 2021లో మరోసారి ప్రభుత్వం లాక్ డౌన్ విధించడంతో తినడానికి తిండి లేకఅల్లాడుతున్న నిస్సహాయులకు 80 మందికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. గత సంవత్సరం ట్రస్టు వర్కింగ్ టీం, ఎంక్వయిరీ టీమ్ సభ్యులు నిత్యవసర సరుకులను పంపిణీ చేసే సమయంలో ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ తో పాటు 8మంది సభ్యులు కరోనా బారిన పడి.. కరోనాను జయించి.మహమ్మారి తో పోరాడుతూ తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టి ఎందరో నిరుపేదలకు సహాయం చేశారు. అదేవిధంగా కరోనా సెకండ్ వేవ్ లో నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేయడానికి తాము ముందుంటామని తెలియజేశారు. కరోనా కష్టకాలంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ నిరుపేదలకు సాయం చేయడానికి మరోసారి ముందుకు వచ్చారని తెలిపారు. ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ సమయంలో నిరుపేదలకు ట్రస్ట్ సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ కె వర్కింగ్ టీం, ఎంక్వయిరీ టీం సభ్యులు పాల్గొన్నారు.బిన

# ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది : ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిమే 15: కరోనాతో ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలో తాజా పరిస్థితిపై జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, సుల్తానాబాద్ ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ శ్రీ రాంతో చర్చించారు.

పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో కరోనా పరీక్షలు, సుల్తానాబాద్ లో పడకల సంఖ్య, ఆక్సిజన్ లభ్యత, రెమిడెసివర్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విపత్కర పరిస్థితులు వస్తే ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్యులు, నర్సుల తోపాటు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు.

కరోనా బారిన పడిన రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆక్సిజన్ తో పాటు మందుల కొరత లేదని అవసరమైన మేర పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కరోనా సోకిన రోగులు ఆందోళన చెందకుండా ధైర్యంతో ఉండాలన్నారు.

# ఏరియా హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే చల్లా

వరంగల్ రూరల్‌మే 15: పరకాల పట్టణంలోని ఏరియా హాస్పిటల్లో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. హాస్పిటల్లో ఏర్పాటు చేస్తున్న కొవిడ్ వార్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరకాలలో సీఎం కేసీఆర్ చొరవ, మంత్రి ఎర్రబెల్లి సహకారంతో 10 ఆక్సిజన్ బెడ్స్ తో కూడిన వార్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ప్రజలందరూ ఇండ్లలోనే ఉండండి సురక్షితంగా ఉండాలని సూచించారు. కరోనా నిబంధనలు పాటిస్తూ లాక్ డౌన్ సడలింపు సమయంలో అత్యవసరమైతేనే బయటికి రావాలన్నారు. మాస్కు తప్పకుండా ధరించి భౌతిక దూరం పాటించాలన్నారు.

మన మనోధైర్యమే మనకు బలమని, ధైర్యంగా ప్రజలు కరోనా మహమ్మారిని ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చల్లా మధుసూదన్, సూపరింటెండెంట్ డా.ఆకుల సంజీవయ్య, కౌన్సిలర్లు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ పేషెంట్లు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి..



రాజన్న సిరిసిల్ల మే, 15(నేటినిజం ప్రతినిధి): కరోనా పేషెంట్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఎన్ఎం జ్యోతి అన్నారు, చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం కరోనా పాజిటివ్ వచ్చిన వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు,

పాజిటివ్ వచ్చినవ్పటి నుండి రోజురోజుకు ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వ అందజేస్తున్న మెడికల్ కిట్ల గోలీలను రోజు వేసుకోవాలన్నారు, అలాగే వేడి నీటిని తాగాలన్నారు, మంచి పౌష్టికాహారం, భోజనం తీసుకోవాలన్నారు,

ఇంకేమైనా ఆరోగ్య సమస్యలు, జ్వరం తీవ్రత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు, ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు,






**వి-శాలాక్షి**
సాహిత్య మాస పత్రిక
**శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి**
స్మారక కథల పోటీ

విశాలాక్షి సాహిత్యమాస పత్రిక సంక్రాంతి కథల పోటీ నిర్వహించిన విజయానందంలో ఇప్పుడు శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక కథల పోటీతో మరోసారి కథా రచయిత (త్రు)లకు చేరువవుతుంది. సంక్రాంతి కథల ప్రత్యేక సంపుటి లానే మరో కథల సంపుటిని ప్రత్యేకంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉన్నాము. మీరంతా బహుమతులతో, మంచి తెలుగు కథలతో ప్రత్యేక సంపుటిని తెలుగు కథా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపేలా భాగస్వాములయ్యేందుకు కొత్త కలంతో, సిరా బలంతో ముందుకు రావాలని మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాము.

**బహుమతుల వివరాలు**

| | |
|---|---|
| వేసవి కథల సంపుటి కోసం<br>15 కథలు ఎంపిక జరుగుతుంది.<br>ఒక్కో కథకు రూ. 3000/-<br>సమాన బహుమతి ఉంటుంది. | 15 కథలు<br>ఒక్కో కథకు రూ. 3000/-<br>సమాన బహుమతి<br>మొత్తం రూ. 45,000/- |

ఎంపికైన మరికొన్ని కథలు - విశాలాక్షి మాసపత్రికలో సాధారణ ప్రచురణ జరుగుతుంది

- ✓ స్వచ్ఛమైన తెలుగు కథ. కొత్త కథ అయి ఉండాలి
- ✓ తిరిగొచ్చిన కథలు, జెరాక్స్ ప్రతులు వద్దు
- ✓ ఏదైనా సామాజిక అంశం.
- ✓ A4లో 5 పేజీలు మించకుండా యూనికోడ్‌లో మెయిల్‌కు పంపాలి.
- ✓ కథ మీద రచయిత పేరు లేకుండా ప్రత్యేకంగా హామీ పత్రంలో రాయాలి.
- ✓ ఎంపిక కాని కథలు తిరిగి పంపరనే విషయాలు ప్రత్యేకంగా చెప్పటం లేదు.

కథలు పంపవలసిన మెయిల్ :
e-mail : visalakshi.poteelu@gmail.com

Address :
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785

గడువు : 15-7-2021


# లాక్ డౌన్ సందర్భంగా యాచకులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన మున్సిపల్ చైర్పర్సన్



రాజన్న సిరిసిల్ల మే, 15(నేటినిజం ప్రతినిధి): కరోనా వ్యాధి వేగంగా ప్రబలిస్తున్న నేపథ్యం లో తెలంగాణ ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ కారణంగా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయం ముందర భిక్షాటన చేసుకునే యాచకుల ఆకలి తీర్చే ఉద్దేశంతో మున్సిపల్ పాలకవర్గం మరియు ఎమ్మెల్యే రమేష్ బాబు ఆ దేశాలతో లాక్ డౌన్ ఎత్తి వేసే వరకు ప్రతిరోజు మధ్యాహ్నం గుడి ముందు గల అంబేద్కర్ విగ్రహం వద్ద అన్నపూర్ణ క్యాంటీన్ ద్వారా భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్ర మాన్ని పాలక వర్గం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్ర మాన్ని ఉద్దేశించి మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి-రాజు గార్లు మాట్లాడుతూ గౌరవ ఎమ్మెల్యే రమేష్ బాబు గారి సూచనల మేరకు మా పాలకవర్గం అనుమతి తీసుకొని ఈ లాక్ డౌన్ సమయంలో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకే షాపులు తీసి ఉండడం వలన యాచకులు ఆకలితో అలమటించ కూడదనే ఉద్దేశంతో ప్రతిరోజు మధ్యాహ్నం 1:00 గంటలకి ఉచితంగా దాదాపు 100 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మరియు అదేవిధంగా రాత్రి పూట కూడా భోజన వసతి ఏర్పాటు గురించి ఎమ్మెల్యే రమేష్ బాబు దృష్టికి తీసుకపోగా తక్షణమే వారు స్పందించి ఆలయ అధికారులతో మాట్లాడి రాత్రిపూట కూడా 100 మంది యాచకులకు భోజన వసతి ఏర్పాటు చేపిస్తామని చెప్పడం జరిగింది. మధ్యాహ్నం సమయంలో మున్సిపల్ పాలకవర్గం వారిచే భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని రాత్రిసమయంలో ఆలయ అధికారులతో భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ మారం కుమార్ , గోలి మహేష్ వారి పెళ్లి రోజు సందర్భంగా అన్నపూర్ణ క్యాంటీన్ కి 1116 రూపాయల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ రావు మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ , మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఇప్పపుల్ల అజయ్,సిరిగిరి రామ చంద్రం ,యాచమనేని శ్రీనివాసరావు, బింగి మహేష్, కౌన్సిల్ మారం కుమార్, కొండ శ్రీలత కనకయ్య వంగల దివ్య శ్రీనివాస్ ,గోలి మహేష్ కోఆప్షన్ సభ్యులు షేక్ సర్వర్ అలీ , ,ఆలయ ఏ ఈవో సంకే పల్లి హరి కృష్ణ పర్యవేక్షకులు శ్రీరాములు, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.

# మిస్ కాల్ ఇస్తే ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్ మీ ముందుంటుంది: సోనూసూద్

హైదరాబాద్ , మే 15: కరోనా విలయతాండవం చేస్తున్న నేపథ్యంలో సోనూసూద్ శక్తి మేర సేవా కార్యక్రమాలు చేసుకుంటూ వెళుతున్నాడు. ప్రస్తుతం ఢిల్లీలో కరోనా ఎక్కువగా ఉండడం, ఆక్సిజన్ కొరత పెరుగుతుండడంతో సోనూసూద్ తుష్టి ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఢిల్లీలో కరోనా బాధితులకు ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎవరికైన ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్ కావాలి అంటే 02261 403615 ఈ నంబర్‌కు మిస్ కాల్ ఇస్తే చాలని సోనూసూద్ తన ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు.ఢిల్లీలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో చాలా మంది మా సాయం కోరారు. అందుకే రెండు ఫౌండేషన్‌తో కలిసి ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్ మీ ఇంటి ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నాం. ఉచితంగా మేము మీకు ఆక్సిజన్ కాన్‌సెంట్రేటర్ అందిస్తాం. మీ పని అయిన తర్వాత ఖాళీ కాన్‌సెంట్రేటర్ తిరిగి వంపండి. అవసరంలో ఉన్న వారికి అండగా నిలబడడం చాలా పెద్ద విషయమని పెద్దలు చెబుతారు. అదే నేను చేస్తున్నా అని సోనూసూద్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.